ప్రతి నిత్యం తాజా వార్తలతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేషిస్తూ ముస్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక

సుఫల అక్షరం
తెలుగు దినపత్రిక సామాన్యుడి అస్త్రం
Your Ad Here.

ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి

EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com

www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

## దేశ యువత కోసం రాహుల్ పోరాటం

### ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ రెడ్డి పోస్ట్

హైదరాబాద్,జులై 21 యువత భవిష్యత్ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జికి బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రధాని నివాసం వద్ద ధర్నా చేపట్టారు. ఈ ఆందోళనకు మద్దతు తెలుపుతూ సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ మద్దతుగా నిలిచారని చెప్పారు. యంగ్ ఇండియాకు కాంగ్రెస్ అండగా ఉంటుందని సీఎం పేర్కొన్నారు.

WEDNUSDAY 22ND JULY 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 126 COST : 3\- KHAMMAM, TELANGANA

బుధవారం 22 జూలై 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక :126 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

# ఎల్‌నినో ప్రభావంతో ప్రభుత్వం అప్రమత్తం

- ప్రత్యామ్నాయ ప్రయత్నాల్లో ఉన్నాం
- వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు సమిష్టిగా కృషి
- కంటింజెన్సీ ప్రణాళికలను అమలు చేయాలి
- హన్మకొండ కలెక్టరేట్‌లో సమీక్షించిన మంత్రి పొంగులేటి




హన్మకొండ,జులై 21 రాష్ట్రంలో ఎల్‌నీనో ప్రభావంతో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర రవాణా / బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలసి ఎల్‌నీనో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కంటింజెన్సీ ప్రణాళికల అమలుపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎల్‌నీనో పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాభావ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించగా, ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేనను నియమించినట్లు తెలిపారు. వ్యవసాయం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక అధికారులు నివేదికలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారని చెప్పారు. సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించి అవసరమైన సహాయం కోరనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల

➢ మిగతా 2వ పేజిలో..

## సన్న వడ్ల కుంభకోనం గతంలో జరిగిందేమో

- ఈ ప్రభుత్వంలో అలాంటిదేమీ జరగలేదు
- హరీష్ రావు తదితరుల విమర్శలకు మంత్రి ఉత్తమ్ కౌంటర్



హైదరాబాద్,జూలై21 ఈ ప్రభుత్వంలో సన్న వడ్ల కుంభ కోణం అనేది అవాస్తవ మని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దీనిపై మీడి యా - సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదని అన్నారు. కొందరు కావాలని సన్న వడ్ల కుంభకోణం అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఈ కుంభకోణం జరిగి ఉండవచ్చని ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పని పారదర్శకంగా జరుగుతుందని వివరించారు. ధరలు పెంచి టెండర్ కోడ్ చేస్తే.. ఎవ్వరూ ముందుకు రాలేదని అన్నారు. అందుకే మళ్ళీ పిలిచారని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటిపారుదలలో ఎక్స్‌పర్ట్ అయితే.. హరీశ్ రావును మంత్రి పదవి నుంచి కేసీఆర్ ఎందుకు తొలగించారంటూ ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి సందేహం వ్యక్తం చేశారు. ముందు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

➢ మిగతా 2వ పేజిలో..



## ప్రధాని నివాసం ముందు కాంగ్రెస్ నేతల ఆందోళన

- కాంగ్రెస్ ధర్నాతో స్వల్ప ఉద్రిక్తత
- బలవంతంగా అరెస్ట్ చేసి తరలించిన పోలీసులు
- రాహుల్ సహా కాంగ్రెస్ నేతల అరెస్ట్

➢ 2వ పేజిలో..

## ఉద్యమకారులకు వెంటనే న్యాయం చేయండి

- కెకె కమిటీకి నివేదిక అందించిన కవిత

## నీట్ పేపర్ లీక్‌పై స్పందించిన ప్రధాని

- పిల్లలను రెచ్చగొట్టదన్న మోడీ
- నిందితులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



న్యూఢిల్లీ,జులై 21: నీట్ లీకేజీ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. పేపర్ లీక్ ఘోర పాపమని, ఇలాంటివి మళ్లీ జరగకూడదని వ్యాఖ్యానించారు. బాధ్యులకు కఠిన శిక్ష విధించాలని, ఇలాంటి లీక్‌లను నివారించడం జాతీయ బాధ్యత అని పేర్కొన్నారు. 'మంగళ్ మిలన్' పేరిట మంగళవారం జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఈ మేరకు ప్రధాని మాట్లాడారు. ఆయన మాట్లాడిన అంశాలను కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. పార్లమెంట్‌లో నిర్మాణాత్మక చర్చలు జరిగేలా విపక్షాలు సహకరించాలి. రాజకీయంగా విభేదాలు ఉండొచ్చు. కానీ దేశ భవిష్యత్తు, యువత సంక్షేమం కోసం కలిసి పనిచేయాల్సిన బాధ్యత ఎంపీలందరిపై ఉందని ప్రధాని సూచించారు. 'పిల్లలను రెచ్చగొట్టొద్దు. తప్పుడు మార్గంలోకి వెళ్లడం సులభం. కానీ తిరిగి సరైన మార్గంలోకి రావడం చాలా కష్టం. వారు సరైన మార్గంలో వెళ్లేలా చూసుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. దేశంలో ప్రధాన పోటీ పరీక్షల్లో ఒకటైన నీట్ (ఔఇఇ÷) మేలో నిర్వహించగా.. పేపర్ లీక్ ఆరోపణలతో జూన్‌లో మళ్లీ పరీక్ష నిర్వహించాల్సి వచ్చింది. సీబీఎస్ఈ 12వ తరగతిలో ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) విధానంలోనూ లోపాలు వెలుగుచూశాయి. అలాగే మరికొన్ని లీకేజీ ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యా వ్యవస్థలో సంస్కరణలు అమలు చేయాలని డిమాండు చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన 'చలో పార్లమెంటు' తీవ్ర ఉద్రిక్తతలకు

➢ మిగతా 2వ పేజిలో..


## అస్సాంను ముంచెత్తిన వరదలు

- భారీ వర్షాలకు జనజీవనం అతలాకుతలం
- పదిమంది మృతి..లక్షలాది మంది నిరాశ్రయులు



➢ మిగతా 2వ పేజిలో..

## సిక్కింలో ఘోర విషాదం



- నిర్మాణంలో ఉన్న సొరంగంపై విరిగిపడ్డ కొండచరియలు
- పదిమంది కార్మికుల దుర్మరణం

గ్యాంగ్‌టక్,జూలై21 సిక్కింలో ఘోర విషాదం చోటుచేసుకుంది. దక్షిణ సిక్కింలోని సమర్‌దుంగ్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న సొరంగం వద్ద కొండచరియలు విరిగిపడటంతో ఘోర ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఇప్పటివరకు పదిమంది మృతిచెందారు. వారి మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు వెల్లడించారు. మరో 20 మందికిపైగా కార్మికులు శిథిలాల కింద చిక్కుకుని ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను నామ్చి జిల్లా కలెక్టర్ అనుప తమ్లింగ్ వెల్లడించారు. సోమవారం తీస్తా స్టేజ్-జలవిద్యుత్

➢ మిగతా 2వ పేజిలో..

## సిజెపి మార్చ్ సందర్భంగా లాఠీఛార్జ్ దురదృష్టకరం

- ఈ ఘటనపై ప్రధాని మోడీ మౌనం వీడాలి
- పార్లమెంటులో అత్యవసరంగా చర్చించాలి: రాహుల్



న్యూఢిల్లీ,జూలై21:ఢిల్లీలో సీజేపీ మార్చ్ సందర్భంగా విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యను కాంగ్రెస్ అగ్ర నాయకుడు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఖండించారు. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వీడాలని డిమాండ్ చేశారు. పోలీసుల లాఠీచార్జి, టియర్ గ్యాస్ ప్రయోగంలో గాయపడిన విద్యార్థులను రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ కలిసి పరామర్శించ నున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది . పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ, విద్యార్థులపై జరిగిన పోలీసు చర్య గురించి ప్రధాని మోదీ ఇప్పటివరకు స్పందించక పోవడం ఆశ్చర్యకరమన్నారు. విద్యార్థులపై

➢ మిగతా 2వ పేజిలో..

# అస్సాంను ముంచెత్తిన వరదలు

గౌహతి,జూలై21 అస్సాంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. భారీ వానల కారణంగా ఇప్పటివరకు 10 మంది మృతిచెందగా, లక్షల మంది నిరాశ్రయులయ్యారు. వర్షాలకు అస్సాం రాష్ట్రవ్యాప్తంగా 16 జిల్లాల్లో 794 గ్రామాలు ప్రభావితమయ్యాయి. శివసాగర్, చరైడియో, జోర్హాట్, దిబ్రూఘర్, సోనిత్‌పూర్, బిస్వనాథ్, గోలాఘాట్, ధేమాజీ, తిన్‌సుకియా, నాగావ్, కర్బీ అంగ్లాంగ్, కాచర్, ఉదల్‌గురి, చిరాంగ్, కమ్‌రూప్, కమ్‌రూప్ (మెట్రో) జిల్లాలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. ఆయా జిల్లాల్లో మొత్తం 3.62 లక్షల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సహాయక బృందాలు రంగంలోకి దిగి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి. అధికారులు 101 సహాయక శిబిరాలను ఏర్పాటు చేసి నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్నారు. మరోవైపు భారీ వర్షాలతో నదులకు వరదనీరు పోటెత్తుతోంది. నేమతిఘాట్ వద్ద బ్రహ్మపుత్ర, చెనిమారి (ఖోవాంగ్) వద్ద బుర్హిదిహింగ్, నాంగ్లాముఠాఘాట్ వద్ద దిసాంగ్, నుమాలిగఢ్ వద్ద ధన్‌సిరి (దక్షిణ), శివసాగర్ వద్ద దిఖౌ నదులు ప్రమాద స్థాయికి మించి ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాలకు వరదనీరు జనావాసాల్లోకి వచ్చింది. ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే అనేక రోడ్లు దెబ్బతిన్నాయి. వర్షాలకు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. దాదాపు 19,100 హెక్టార్లలో పంటలు నీట మునిగాయి. మరోవైపు, అస్సాంలోని కొన్ని ప్రాంతాల్లో మరింత వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ మేరకు చెరువులు, నదుల నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అలాగే ప్రమాదకర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు అధికారుల సూచనలను పాటిస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచిస్తున్నారు.

## నలుగురు రైతులు చనిపోయినా బాధ్యత లేదా

కాసి ఉన్నప్పుడు గోడ కూలి నలుగురు రైతులు చనిపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పంట కొనకపోవడం వల్ల గోడ కూలి ప్రాణాలు కోల్పోయిన నలుగురు రైతుల కుటుంబాలకు కేటీఆర్ ఆర్థిక సాయం అందించారు. మే 6న లక్షెట్టిపేట మండలంలో పంటలు కాపాడుకునేందుకు వెళ్లి మృత్యువాత పడిన నలుగురు రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ. 5 లక్షల చొప్పున మొత్తం రూ. 20 లక్షల ఆర్థికసాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. నలుగురు రైతులు చనిపోతే వారికి న్యాయం చేయాలని మా బీఆర్ఎస్ నాయకులు జీవన్ రెడ్డి, దివాకర్ రావు 8 గంటలు ధర్నా చేసినా.. దున్నపోతు మీద వాన పడ్డట్లు ప్రభుత్వం నుండి స్పందన రాలేదు. చివరికి ఏదో మొక్కుబడిగా ఒప్పుకున్నారు.. చూస్తాం.. చేస్తాం అని ఒప్పుకున్నరు.. కానీ ఈ రోజు వరకు దాదాపు 2 నెలలు గడిచిపోయినా స్పందన లేదు. కనీసం మానవత్వం అనే ఆలోచన కూడా లేదు. ఈ నలుగురు జీవితాలు అర్థాంతరంగా ముగిసిపోయిన తర్వాత నాకు దివాకర్‌రావు, జీవన్ రెడ్డి కలిసి ఫోన్ చేశారు. అన్నా పార్టీ తరపున మనమైనా ఏమన్నా చెప్పాలే.. ఎందుకంటే రైతులు ఇలా ఇబ్బంది పడుతున్నారు.. వారికి అండగా నిలబడాలన్నారు. ఆ రోజు మేం వరంగల్‌లో ఉన్నం.. రైతు సంగ్రామ సదస్సు నిర్వహిస్తున్నాం. అదే రోజు ఈ బాధాకరమైన సంఘటన జరిగింది. వెంటనే కేసీఆర్‌ను అడిగినం. మంచిర్యాల జిల్లాలో జరిగిన ఈ విషాదానికి పార్టీ తరపున తప్పకుండా మనం అండగా నిలబడదాం.. ఒక్కో రైతుకు రూ.5 లక్షలు వెంటనే ప్రకటించాలని కేసీఆర్ చెప్పారన్నారు. ఇవాళ శోకసంద్రంలో ఉన్న రైతు కుటుంబాలను నేను అడిగిన. ప్రభుత్వం నుంచి ఏమన్నా వచ్చిందా అమ్మా అని అడిగిన. రెండున్నర నెలలు అయిపోయింది.. మంచిర్యాలలో ఉన్నది కాంగ్రెస్ ఎమ్మెల్యే.. రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం. జరిగింది ఒక విషాదం.. ఏ రాజకీయ పరమైన హడావిడి లేదు.. ఏ ఆర్భాటం లేదు.. ఏ ఎన్నిక లేదు.. కానీ ప్రభుత్వం నుంచి స్పందన లేదు. నలుగురితో మాట్లాడుతుంటే ఒక్కొక్కరిది ఒక్కో బాధ. వాళ్లందరు చెప్పింది ఒక్కటే మాట.. ఇవాళ నలుగురు రైతులు చనిపోతే ఒక్క రైతుకు మాత్రమే రూ.5 లక్షలు వచ్చింది. అది కూడా ఎక్కడిది.. కేసీఆర్ పెట్టిన రైతు బీమా నుంచి రూ.5 లక్షలు ఇచ్చారు. కానీ మిగిలిన ముగ్గురికి రూ.5 లక్షలు కాదు కదా.. రూ.5 వేలు కాదు.. 5 పైసలు కూడా ప్రభుత్వం నుంచి సహాయం అందలేదని కేటీఆర్ మండిపడ్డారు. మంగళవారం మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు చేరకున్న కేటీఆర్ లక్షెట్టిపేట సమీపంలోని అంకతిపల్లిలోని వాసవీ ఫంక్షన్‌హాలుకు చేరుకుని రైతు సదస్సులో పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీక్‌పై స్పందించిన ప్రధాని

చూసుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. దేశంలో ప్రధాన పోటీ

పరీక్షల్లో ఒకటైన నీట్ (ఔఇఇ÷) మేలో నిర్వహించగా.. పేపర్ లీక్ ఆరోపణలతో జూన్‌లో మళ్లీ పరీక్ష నిర్వహించాల్సి వచ్చింది. సీబీఎస్ఈ 12వ తరగతిలో ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) విధానంలోనూ లోపాలు వెలుగుచూశాయి. అలాగే మరికొన్ని లీకేజీ ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యా వ్యవస్థలో సంస్కరణలు అమలు చేయాలని డిమాండు చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన 'చలో పార్లమెంటు' తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వేల మంది సీజేపీ మద్దతుదారులు పార్లమెంటువైపు దూసుకురావడం, బారికేడ్లను దాటి వెళ్లేందుకు ప్రయత్నించడంతో దిల్లీ రణరంగాన్ని తలపించింది. ఈ నేపథ్యంలోనే మోదీ స్పందన వచ్చింది.

## సన్న వడ్ల కుంభకోణం గతంలో జరిగిందేమో

అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలంటూ హరీశ్ రావుకు సూచించారు. దేవాదులలో 7 పంపులు నడుస్తున్నాయని.. నేడు మరో రెండు అందుబాటులోకి వస్తాయని అన్నారు. రూ.14 వందల కోట్ల సంగతి ఏమిటో ముందు సమాధానం చెప్పాలంటూ హరీశ్ రావును మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

## ములుగు జిల్లాలో విస్తారంగా వర్షాలు

జోరు వానలకు తెగిపోయిన రోడ్డు

ములుగు,జూలై21: ములుగు జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల వృక్షాలు నేలకూలాయి. వాజేడు మండలంలోని జాతీయ రహదారి 163 పై ఇసుక వాగు బ్రిడ్జి వద్ద తాత్కాలిక రోడ్డు వర్షానికి తెగిపోవడంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంతో పాటు తెలంగాణ రాష్ట్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. ములుగు జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించడంతో పలుచోట్ల వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జిల్లాలో సగటున 7.66 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వాజేడు, వెంకటాపురం మండలాల్లో గరిష్ఠంగా 11 సెం.మీ.కు పైగా వర్షపాతం నమోదైంది.

# సిక్కింలో ఘోర విషాదం

ప్రాజెక్టుకు సంబంధించిన సొరంగంలో ఈ ప్రమాదం జరిగింది. పటేల్ ఇంజినీరింగ్ సంస్థ నిర్మాణ పనులు నిర్వహిస్తుండగా, సొరంగం లోపల అకస్మాత్తుగా కొండచరియలు విరిగిపడి మార్గం పూర్తిగా మూసుకుపోయింది. అదే సమయంలో మిథేన్ గ్యాస్ లీక్ కావడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. ఘటన అనంతరం జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం, సిక్కిం పోలీసులు, అగ్నిమాపక, అత్యవసర సేవల బృందాలు సహాయక చర్యలు ప్రారంభించాయి. అయితే సొరంగంలో మిథేన్ గ్యాస్ స్థాయిలు అధికంగా ఉండటంతో రక్షణ సిబ్బంది లోపలికి వెళ్లడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదనంగా ఎన్‌హెచ్‌పీసీకి చెందిన ఆరుగురు సిబ్బంది కూడా లోపలే ఉన్నట్లు సమాచారం. సొరంగంలోకి ప్రవేశించిన తొలి సహాయక బృంద సభ్యులు మిథేన్ ప్రభావంతో శ్వాస తీసుకోవడంలో పలు సమస్యలను ఎదుర్కొన్నారు. వారిని వెంటనే బయటకు తీసుకువచ్చి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.

# సిజెపి మార్చ్ సందర్భంగా లాఠీఛార్జ్ దురదృష్టకరం

జరిగిన ఘటనకు ప్రధాని క్షమాపణ చెప్పాలని, ఇలాంటి చర్యలు వెంటనే ఆగాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశాల ప్రారంభానికి ముందు రాహుల్ గాంధీ సహా ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి ఈ ఘటనపై అత్యవసర చర్చ నిర్వహించాలని కోరారు. ÷రిలీలీసు చర్యలో గాయపడిన విద్యార్థులు చికిత్స పొందుతున్న రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రికి రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వెళ్లి వారిని పరామర్శించనున్నారు. విద్యార్థుల గొంతును అణచివేసే ప్రయత్నాలను కాంగ్రెస్ సహించబోదని రాహుల్ స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు, పరీక్షల వ్యవస్థలో నెలకొన్న సంక్షోభం, పోలీసు చర్యపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన సీజేపీ మార్చ్ సందర్భంగా వేలాది మంది విద్యార్థులు పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు లాఠీచార్జి, టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనలో 100 మందికి పైగా పోలీసులు, 60 మందికి పైగా నిరసనకారులు గాయపడినట్లు అధికారులు తెలిపారు.

## ఎల్‌నినో ప్రభావంతో ప్రభుత్వం అప్రమత్తం

పంటలపై వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. కోతుల బెడద నివారణ చర్యలపైనా రైతులకు సూచనలు ఇవ్వాలని అన్నారు.దేవాదుల ప్రాజెక్టు మోటార్లు ప్రతిరోజూ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఏదైనా లోపం తలెత్తితే 24 గంటల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. దేవాదుల ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. దేవాదుల, సాగునీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఈ సమన్వయాన్ని ములుగు జిల్లా కలెక్టర్ పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను సన్నద్ధం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్‌నీనో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాల నేపథ్యంలో రైతులకు తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా లెమన్ గ్రాస్ వంటి ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో పశుసంవర్ధక రంగానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి అవసరాలకు సరిపడా నీటి లభ్యతపై వెంటనే సమగ్ర నివేదికలు సిద్ధం చేసి అందించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పైస్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ సమన్వయంతో పనిచేయాలని, ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టడం ద్వారానే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడగలమని మంత్రి అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ, రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సామాజిక బాధ్యతతో పనిచేస్తే వర్షాభావ పరిస్థితులను విజయవంతంగా అధిగమించవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, తెలంగాణ శాసనసభ డిప్యూటి స్పీకర్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, దొంతి మాధవ రెడ్డి, కడియం శ్రీహరి, కె.ఆర్. నాగరాజు, డా. మురళి నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు వెంటనే న్యాయం చేయండి

- కెకె కమిటీకి నివేదిక అందించిన కవిత



హైదరాబాద్,జులై 21 ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం కోసం పోరాడిన ఉద్యమకారులకు న్యాయం చేసే విషయంలో ఆలస్యం చేయవద్దని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీకి టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఉద్యమకారులకు న్యాయం చేయాలంటూ కవిత రూపొందించిన నివేదికను ఆ కమిటీకి మంగళవారం ఆమె అందజేశారు. అనంతరం ట్యాంక్ బండ సమీపంలోని అమరజ్యోతి వద్ద ఆమె మాట్లాడుతూ.. స్వతంత్ర సైనిక సమ్మాన్, హైదరాబాద్ లిబరేషన్ మూమెంట్ రూల్ పొజిషన్‌ను స్టడీ చేయాలని ఈ సందర్భంగా ఆ కమిటీకి సూచించారు. వాటిలో ఉన్న విధంగా ఉద్యమకారులకు ప్రయోజనం కలిగించాలని స్పష్టం చేశారు. కేకే కమిటీ అంటే కాలయాపన కమిటీ అనే భావన ఉంది.. అది తప్పని నిరూపించాలని ఆ కమిటీ చైర్మన్‌తో ఆమె పేర్కొన్నారు. ఉద్యమకారుల కోసం బీఆర్ఎస్‌లో అంతర్గతంగా పోరాటం చేసి బలైన వ్యక్తిని తానని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తన సూచనలు, సలహాల ద్వారా ఉద్యమకారులకు కొంత మేలు జరిగితే తన జన్మ ధన్యమైనట్లేనని టీఆర్ఎస్ చీఫ్ కవిత తెలిపారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కోసం పోరాడిన ఉద్యమకారులను గుర్తించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా కె. కేశవరావును నియమించింది.

# సిజెపి ఆందోళన వెనక కుట్ర కోణం?

న్యూఢిల్లీ,జూలై21: దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం చేపట్టిన చలో సంసద్ నిరసన కార్యక్రమం హింసాత్మకంగా మారడం ఒక ఎత్తయితే..వారి ఆందోళనల వెనక ఉన్న కుట్ర కోణాలను పోలీసులు కూపీ లాగుతున్నారు. సోమవారం నిరసనకారులను అడ్డుకునేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. ఈ ఘటనలో పలువురు నిరసనకారులు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం కూడా పరిస్థితులు ఉద్రిక్తంగానే ఉన్నాయి. దీంతో రాజధానిలో హై టెన్షన్ నెలకొంది. మరోవైపు విపక్ష పార్టీలు ప్రధాని మోడీ నివాసం ఎదుట నిరసనకు దిగారు. సర్వత్రా టెన్షన్.. టెన్షన్ వాతావరణం చోటుచేసుకుంది. అయితే తాజాగా పోలీసుల దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సీజేపీ నిరసన హింసాత్మకంగా మారడానికి భారీ కుట్ర జరిగినట్లుగా పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చాయి. సోమవారం ఢిల్లీలో ఇంటర్నెట్ సేవలు పూర్తిగా నిలిచిపోయినా పెద్ద ఎత్తున నిరసనకారులు ఎలా రాగలిగారు అన్న దానిపై ఆరా తీస్తున్నారు. ఈ సందర్భంగా విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిరసనకారులు పరస్పరం సందేశాలు పంపించుకున్నట్లు కొన్ని చాట్ సందేశాలు వెలుగులోకి వచ్చాయి. ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయినా పరస్పరం సంప్రదింపులు కొనసాగించేందుకు బ్లూటూత్ ఆధారిత 'సీక్రెట్ యాప్' వినియోగించినట్లుగా తేటతెల్లమైంది. అంతేకాకుండా కొంతమంది ప్రాణత్యాగానికైనా సిద్ధంగా ఉండాలని సందేశాలు పంపించుకున్నారు. ప్రస్తుతం ఈ సందేశాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చాట్‌ల వెనుక ఉన్న రహస్యం, వాటిని పంపిన వ్యక్తుల గుర్తింపును ధృవీకరించే ప్రక్రియ కొనసాగుతోంది. అన్ని ఆధారాలను పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. పోలీసుల దర్యాప్తులో భాగంగా బయటకు వచ్చిన చాట్‌లలో.. నిరసన ప్రాంతానికి చేరుకున్న తర్వాత మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులో లేకపోవచ్చని హెచ్చరికలు ఉన్నట్లు సమాచారం. గతంలో కూడా

పోలీసులు నెట్‌వర్క్ జామర్లు ఉపయోగించారని, ఈసారి కూడా అదే జరిగే అవకాశం ఉందని పేర్కొంటూ ప్రత్యామ్నాయ కమ్యూనికేషన్ మార్గాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఒక సందేశంలో.. 'నిరసన ప్రాంతానికి వెళ్లాక ఫోన్ నెట్‌వర్క్ ఉండకపోవచ్చు. అందుకే ముందుగానే అందరూ ఒకే యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని కనెక్ట్ అవ్వాలని సూచించినట్లు పోలీసులు గుర్తించారు. బ్లూటూత్ సిగ్నల్ ఆధారంగా పనిచేసే కొన్ని యాప్‌ల లింకులను కూడా అదే గ్రూపులో షేర్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఆ యాప్‌లపై సైబర్ నిపుణులు సాంకేతిక విశ్లేషణ చేస్తున్నారు. చాట్‌ల్లో తీవ్ర రాజకీయ హెచ్చరికలు కూడా ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. ఒక సందేశంలో రేపే మోడీ ప్రభుత్వానికి చివరి రోజు అని ఉంది. మరోవైపు కొందరు నిరసనకారులు ఉద్యమం కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధంగా ఉండాలని వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. ఒక సందేశంలో.. ప్రాణత్యాగానికి సిద్ధంగా ఉన్నవారు గుర్తుంచుకోండి.. మీ త్యాగాన్ని భావితరాలు గుర్తుంచుకుంటాయి.' అని ఉండగా.. మరో సందేశంలో 'ఎవరైనా చనిపోతే ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెరుగుతుందని పేర్కొన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ వ్యాఖ్యలు వ్యక్తిగత అభిప్రాయాలేనా? లేక నిరసనలను హింసాత్మకంగా మార్చేందుకు ముందస్తు వ్యూహంలో భాగమా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చాట్ సందేశాలతో పాటు సీసీటీవీ ఫుటేజ్, డ్రోన్ వీడియోలు, మొబైల్ ఫోన్ వీడియోలు, ఇతర డిజిటల్ ఆధారాలను కూడా ఫోరెన్సిక్ పరీక్షలకు పంపినట్లు అధికారులు తెలిపారు. పోలీసుల ప్రకారం.. ప్రతి డిజిటల్ సందేశాన్ని సాంకేతికంగా ధృవీకరించిన తర్వాతే సాక్ష్యంగా పరిగణిస్తామని, దర్యాప్తులో లభించే ఆధారాల ఆధారంగానే తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ప్రధాని నివాసం ముందు కాంగ్రెస్ నేతల ఆందోళన

న్యూఢిల్లీ,జులై 21:ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నివాసం ముందు ఆందోళన చేసిన రాహుల్ గాంధీ.. కాంగ్రెస్, మిత్రపక్షాల ఎంపీలను పోలీసులు మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కి తరలించారు. మందిర్ మార్గ్ పోలీసు స్టేషన్‌లో ఉన్న ఎంపీలను కలిసేందుకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్ పర్సన్ సోనియా గాంధీ వెళ్లారు. అయితే, పోలీసులు సోనియాగాంధీని లోపలికి అనుమతించలేదు. భారత ప్రధాని నరేంద్ర మోదీ నివాసం దగ్గర కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధర్నా చేపట్టారు. సోమవారం జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు నిరసనగా చేపట్టిన ఈ ధర్నాలో రాహుల్‌తో పాటు ఖర్గే, కేసీ, ప్రియాంక, పలువురు కాంగ్రెస్, మిత్ర పక్షాల ఎంపీలు పాల్గొన్నారు. కాంగ్రెస్ నేతలు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. ఈ నిరసనలు ఉద్రిక్తతకు దారి తీయటంతో పోలీసులు బలవంతంగా వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాహుల్, ఖర్గే, ప్రియాంకలను అరెస్ట్ చేసి బలవంతంగా తరలించారు. ఇకపోతే మంగళవారం ఈ నిరసనలు పొలిటికల్ టర్న్ తీసుకున్నాయి. కాంగ్రెస్ నేతలు ప్రధాని నరేంద్రమోడీ నివాసం ముందు ధర్నా చేశారు. కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జున ఖర్గే, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌లు కూడా ఈ ధర్నాలో పాల్గొన్నారు. విద్యార్థులపై దాడికి నిరసనగా ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని పిలుపునిచ్చారు. అయితే కాంగ్రెస్ ధర్నా చేసిన ప్రాంతాన్ని పోలీసులు ఖాళీ చేయించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీను అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌తో పాటు ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని బస్సుల్లో తరలించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకను పోలీసులు వేర్వేరు స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో వున్న ప్రియాంకా గాంధీ వాద్రాను కలిసేందుకు కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ అక్కడికి చేరుకున్నారు. తొలుత ఆమెను లోపలికి పంపేందుకు పోలీసులు నిరాకరించారు. ఆ తర్వాత కాసేపటికి లోపలికి పంపడంతో ప్రియాంకను ఆమె కలిశారు. ఇదిలా ఉండగా.. రాహుల్‌ను మోడల్ టౌన్‌లోని ఛత్రసాల్ స్టేడియానికి పోలీసులు తరలించినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. అంతకుముందు కాంగ్రెస్ ధర్నా వద్దకు వచ్చిన కేంద్ర సహాయ మంత్రి, ప్రధాని కార్యాలయ బాధ్యతలు చూస్తున్న జితేంద్ర సింగ్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్.. రాహుల్‌తో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కేంద్రం ముందు రాహుల్ ప్రధానంగా రెండు డిమాండ్లు ఉంచారు. ఎట్టిపరిస్థితుల్లో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నిన్న విద్యార్థులపై లాఠీఛార్జి చేసిన ఘటనపై పార్లమెంటు ఉభయ సభల్లో కేంద్రం స్పందించాల్సిందేనని పట్టుబట్టారు. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చే వరకు తాము ఈ ఆందోళనలు ఆపేది లేదని, ఇక్కడి నుంచి కదిలేది లేదని రాహుల్ తేల్చి చెప్పారు. ఆ తర్వాత దిల్లీ పోలీసులతో పాటు ఆర్‌పీఎఫ్, ఆర్ఏఎఫ్ బలగాలు భారీగా మోహరించి ప్రధాని నివాసం ముందు ధర్నా చేస్తున్న నేతలందరినీ అదుపులోకి తీసుకోవడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. డిమాండ్లపై రాహుల్‌గాంధీ మాట మార్చారని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ విమర్శించారు. రాహుల్ సహా కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోకముందు మీడియాతో ఆయన మాట్లాడారు. 'నీట్ అంశంపై లోక్‌సభలో చర్చించాలని తొలుత రాహుల్ కోరారు. దానిపై హామీ ఇస్తే ధర్నా విరమిస్తామన్నారు. పార్లమెంట్‌లో చర్చిస్తామని హామీ ఇచ్చాం. ఇప్పుడు మాట మార్చి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతున్నారు. ప్రతిపక్ష నేత హోదాలో ఇలా మాట మార్చడం సరికాదు. రాహుల్ ప్రవర్తన, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. యాగీ చేయడమే ఆయన ఉద్దేశం. రాజకీయ లబ్ది కోసమే రాహుల్ ప్రయత్నిస్తున్నారు. మా ప్రభుత్వం యువతకు అన్యాయం చేయదు'అని జితేంద్రసింగ్ అన్నారు.

## గోదావరిఖనిలో అదనపు జిల్లా న్యాయమూర్తి బదిలీ

జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 21 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : గోదావరిఖని పారిశ్రామిక, కార్మిక న్యాయస్థానం ఛైర్‌పర్సన్, అదనపు జిల్లా న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న కోట్ల లావణ్య బాల్ రెడ్డి బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ముగ్గురు జిల్లా స్థాయి న్యాయమూర్తులను బదిలీ చేస్తూ తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ (జనరల్) మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా కోట్ల లావణ్య బాల్ రెడ్డిని వనపర్తి జిల్లా పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తిగా నియమించారు.కాగా, ఆమె నెల రోజుల క్రితమే గోదావరిఖని పారిశ్రామిక, కార్మిక న్యాయస్థానానికి బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. తాజాగా మరోసారి బదిలీ ఉత్తర్వులు వెలువడటంతో ఆమె వనపర్తిలోని కొత్త బాధ్యతలను చేపట్టనున్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలి

- **ఆర్జి-3 జి యం సుంకరి మధుసూదన్ రావు**



రామగిరి (పెద్దపల్లి జిల్లా) జూలై 21 అక్షరం న్యూస్ ::
ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ అన్నారు.కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు "ఏక్ పెడ్ మాకే నామ్" కార్యక్రమంలో భాగంగా కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ వారి ఆదేశాల మేరకు మంగళవారం సింగరేణి వ్యాప్తంగా ఒక్కొక్క ఏరియాకు పదివేల మొక్కలు నాటే కార్యక్రమం "మాసివ్ ప్లాంటేషన్ డ్రైవ్" (మెగా ప్లాంటేషన్) నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా రామగుండం-3 ఏరియాలోని ఓసిపి-1, ఓసిపి-2 ఉపరితల గనుల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓసిపి-2 ఉపరితల గని ఆవరణలో జరిగిన కార్యక్రమానికి రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ పర్యావరణాన్ని పరిరక్షించడానికి ఎన్నో పర్యావరణహిత కార్యక్రమాలు చేపట్టి, ఉద్యోగుల చేత లక్షలాది మొక్కలు నాటించడం, వాటిని సంరక్షించడం జరుగుతుందని, అంతేకాకుండా చెట్లను పెంచడం వలన కలిగే లాభాలను తెలియజేస్తూ, అవగాహన కల్పిస్తూ పరిసర గ్రామాల ప్రజలకు మొక్కలను పంపిణీ చేయించి, నాటించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వీలైనన్ని మొక్కలు నాటుతూ, నాటిస్తూ వాటిని సంరక్షిస్తూ, జీవన వైవిధ్య పరిరక్షణకు కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్రారెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఎస్వోటు జియం యం.రామ్మోహన్, ఏరియా ఇంజనీర్ ఏ. ఉదయ భాస్కర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.రాజశేఖర్, ఏరియా పర్యావరణ అధికారి పి.రాజారెడ్డి, విభాగధిపతులు బి.టి.మురళీకృష్ణ, బి. సుదర్శనం, కె.ఐలయ్య, షబ్బీరుద్దీన్, ఆసిఫ్ యాసిన్, ఆర్. రాజేశ్వరి, మేఘన, భరత్ కుమార్ లతో పాటు ఇతర విభాగతిపతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంపై దాడిని ఖండించాలి: తోకల రమేష్




జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 21 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:
ఢిల్లీలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, ప్రజలపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా పెద్దపెల్లి డివిజన్ కార్యదర్శి తోకల రమేష్ అన్నారు. మంగళవారం గోదావరిఖనిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఢిల్లీలోని పటేల్ చౌక్ వద్ద శాంతియుత నిరసన చేపట్టిన విద్యార్థులు, మహిళలు, ప్రజలపై పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, ఆ హక్కును హరించే విధంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యంపై దాడితో సమానమని అన్నారు.నిరసనలను కవర్ చేస్తున్న జర్నలిస్టులను అడ్డుకోవడం, మీడియాపై ఆంక్షలు విధించడం కూడా ఆందోళనకరమని చెప్పారు. లాఠీచార్జికి బాధ్యులైన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు.నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని కోరారు. విద్యార్థుల ఆందోళనలను గౌరవించి కేంద్ర ప్రభుత్వం వారితో తక్షణమే చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.విలేకరుల సమావేశంలో జిల్లా నాయకులు ఆడెపు శంకర్, గొల్లపల్లి చంద్రయ్య, కలువల రాయమల్లు, మార్త రాములు, ఎర్రల సారయ్య, గుండ్ల పోషం, కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం సమస్యలు పరిష్కరించాకే రాష్ట్ర రాజకీయాలపై మాట్లాడాలి

- **బీఆర్ఎస్ నేత కౌశిక హరి**



జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 21 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: రామగుండం నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని, ముందుగా స్థానిక సమస్యలపై దృష్టి సారించిన తర్వాతే రాష్ట్ర రాజకీయాలపై వ్యాఖ్యలు చేయాలని బీఆర్ఎస్ నాయకుడు కౌశిక హరి అన్నారు.మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామగుండం ప్రాంతంలో తాగునీరు, సాగునీటి సమస్యలు ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదన్నారు. స్థానిక యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల కల్పనలో ప్రభుత్వం ఆశించిన మేర ఫలితాలు చూపలేదని విమర్శించారు. రామగుండంలో బూడిద అక్రమ రవాణా ఆరోపణలు, ఇళ్ల కూల్చివేతల అంశాలపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం వెనుకబడిందని కౌశిక హరి ఆరోపించారు. పెన్షన్ల పెంపు, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, నిరుద్యోగ భృతి వంటి హామీలు ఇంకా అమలు కాలేదని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేసిన తర్వాతే ఇతర రాజకీయ పార్టీలపై విమర్శలు చేయ్యాలని సూచించారు.రామగుండం నియోజకవర్గ అభివృద్ధి, తాగునీరు, సాగునీరు, ఉపాధి, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే నిజమైన రాజకీయమని, మాటల కంటే చేతలతోనే ప్రజల విశ్వాసాన్ని పొందాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో గాలంకి ప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, మధుకర్ రెడ్డి, పుట్ట శ్రీనివాస్, బండి మహేష్, మాడిశెట్టి రవి, మాజీ సర్పంచ్ బండారి ప్రవీణ్, మాజీ సర్పంచ్ పున్నం సాగర్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ అల్లం రాజన్న, నిమ్మరాజుల రవి, కోదాటి ప్రవీణ్, మద్దికుంట శంకర్, గౌస్ బాబా, బత్తిని సతీష్, కుర్ర రమేష్, ముత్యం లక్ష్మణ్, వల్లపు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

### గోరింటాకు వేడుకల్లో మహిళలతో సందడి చేసిన

## బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుల సంధ్యారాణి...





జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 21 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్
శ్రీ లక్ష్మీ గణపతి మిత్ర మండలి ఆధ్వర్యంలో మార్కండేయ కాలనీలో అత్యంత వైభవంగా నిర్వహించిన గోరింటాకు వేడుకలు మహిళల సందడి, సంప్రదాయ కళా వైభవంతో ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలకు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీమతి లికందుల సంధ్యారాణిలి ముఖ్య అతిథిగా హాజరై మహిళలతో కలిసి గోరింటాకు పెట్టించుకొని, వారి ఆనందోత్సాహాల్లో భాగస్వామ్యమయ్యారు.ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మహిళల చేతుల మీదుగా తరతరాలకు చేరుతున్నాయని పేర్కొన్నారు. గోరింటాకు వంటి సాంప్రదాయ వేడుకలు మహిళల మధ్య ప్రేమ, ఆప్యాయత, ఐక్యతను పెంపొందించడమే కాకుండా కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. ఆధునిక జీవనశైలిలో కూడా మన సంప్రదాయాలను కాపాడుకుంటూ యువతకు వాటి గొప్పతనాన్ని పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు.అనంతరం మహిళలతో కలిసి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు, సంప్రదాయ గీతాలు, వినోద కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని అందరినీ అలరించారు. మహిళలతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. మహిళలు ఆమెకు ఘన స్వాగతం పలికి జ్ఞాపికతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో గుర్రం వీణ, బైరి శ్రీదేవి, గడ్డం ధనశ్రీ, వంగల స్వాతి, బి. శ్రీలత, తాజంపురం సంధ్యారాణి, జక్కన రాజమణి, రమ్య, రాధిక, సాయి ప్రియ, భైరభట్ల సారథి, ఓదెల పద్మావతి, నడిపెల్లి అంజలి, కొక్కుల అనిత, దేవునూరి స్వప్నతో పాటు మార్కండేయ కాలనీకి చెందిన మహిళలు, యువతులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## 10 వేల మంది విద్యార్థులకు 41 వేల నోట్‌బుక్స్ పంపిణీ ప్రారంభించిన ఎన్టీపీసీ రామగుండం







జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 21 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:
ఎన్టీపీసీ రామగుండం తన కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం ద్వారా రామగుండం, అంతర్గాం, పాలకుర్తి, కమాన్‌పూర్ మండలాల్లోని 127 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 10 వేల మంది విద్యార్థులకు రూ.15 లక్షల వ్యయంతో 41 వేల నోట్‌బుక్స్ పంపిణీ చేయనుంది.ఈ కార్యక్రమం తొలి విడతను మంగళవారం రామగుండం మండలంలో ప్రారంభించారు. కార్యక్రమానికి దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సమంత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రామగుండం మండల విద్యాధికారి జింక మల్లేశం, దీప్తి మహిళా సమితి సభ్యులు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన అతిథులు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎన్టీపీసీ రామగుండం నిరంతరం అందిస్తున్న సహకారాన్ని అభినందించారు. నోట్‌బుక్స్ పంపిణీ వల్ల విద్యార్థులకు చదువులో మరింత ప్రోత్సాహం లభిస్తుందని, వారి విద్యా ప్రయాణానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.పరిసర ప్రాంతాల్లో విద్యా అవకాశాల విస్తరణకు ఎన్టీపీసీ రామగుండం పలు కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ, ద్వంద్వ డెస్క్ బెంచీల ఏర్పాటు, యోగా, కరాటే శిక్షణ కార్యక్రమాల నిర్వహణతో పాటు పాఠశాలల్లో విద్యా మౌలిక సదుపాయాల అభివృద్ధి కూడా ఉన్నాయి.నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం ద్వారా నాణ్యమైన విద్యకు ప్రోత్సాహం అందించడంతో పాటు సమాజ సమగ్రాభివృద్ధికి తమ నిబద్ధతను ఎన్టీపీసీ రామగుండం మరోసారి చాటుకుంది.



## ప్రభుత్వ విప్, చింతకుంట విజయ రమణ రావుకు రాష్ట్ర మంత్రి హోదా



పెద్దపల్లి జిల్లా / సుల్తానాబాద్ / జూలై 21, /అక్షరం న్యూస్ .

ప్రభుత్వ విప్'గా కొనసాగుతున్న పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు,కు రాష్ట్ర మంత్రి హోదాను కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ విప్‌గా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న చింతకుంట విజయ రమణ రావు కు రాష్ట్ర మంత్రి హోదా కల్పించడం పట్ల పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, స్టేట్ వారెంట్ ఆఫ్ ప్రిసిడెన్స్‌లోని ఆర్టికల్--18 ప్రకారం రాష్ట్ర మంత్రి హోదాకు సంబంధించిన అన్ని అధికారిక ప్రోటోకాల్‌లు, మర్యాదలు చింతకుంట విజయ రమణ రావు కు వర్తిస్తాయి. ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి, శాసనసభలో ప్రభుత్వ తరఫున సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తున్న చింతకుంట విజయ రమణ రావు కు రాష్ట్ర మంత్రి హోదా కల్పించడం ఆయన సేవలకు ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపుగా నియోజకవర్గ ప్రజలు భావిస్తున్నారు.

## సీనియర్ సిటిజన్ల భద్రతకు పోలీసుల భరోసా.. వాలంటీర్ కమిటీ సమావేశం



అక్షరం న్యూస్ । సూర్యాపేటటౌన్ , జూలై 21:

సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సీనియర్ సిటిజన్ వాలంటీర్ కమిటీ సభ్యులతో పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో శాంతిభద్రతల పరిరక్షణ, వృద్ధుల భద్రత, కాలనీల్లో నెలకొన్న సమస్యలు, ప్రజల భాగస్వామ్యంతో నేరాల నివారణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ, సమాజంలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పడంలో సీనియర్ సిటిజన్ల అనుభవం, సూచనలు ఎంతో విలువైనవని అన్నారు. పట్టణంలోని వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వారి భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని భరోసా ఇచ్చారు.కాలనీల్లో అపరిచిత వ్యక్తుల సంచారంపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కదలికలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమాజ శ్రేయస్సు కోసం వాలంటీర్లుగా సేవలందిస్తున్న సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులను అభినందించారు.ఈ సమావేశంలో సీనియర్ సిటిజన్ వాలంటీర్ కమిటీ సభ్యులు, పట్టణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎరైవ్ ఎలైవ్'తో రోడ్డు భద్రతపై పోలీసుల అవగాహన.. నిబంధనలు పాటించాలని ఎస్సై ఐలయ్య పిలుపు



అక్షరం న్యూస్ । సూర్యాపేట/ఆత్మకూర్ (ఎస్), జూలై 21:

సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఆత్మకూర్ (ఎస్) పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సై ఐలయ్య ఆధ్వర్యంలో మంగళవారం 'ఎరైవ్ ఎలైవ్' రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులు, స్థానిక ప్రజలకు రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.ఎస్సై ఐలయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని, అతివేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని తెలిపారు.డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ వినియోగించరాదని, అది దృష్టి మరల్చి ప్రమాదాలకు దారితీస్తుందని చెప్పారు. అలాగే మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.ట్రాఫిక్ నిబంధనలను స్వచ్ఛందంగా పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని, ప్రాణనష్టం జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్సై ఐలయ్య పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్థానిక వాహనదారులు, ప్రజలు పాల్గొన్నారు.

# గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ





ఆసుపత్రి సిబ్బంది వైద్యులు తగిన జాగ్రత్తలు చేపట్టారు.

జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 21 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు ఆయన సతీమణి మనాలి రాజ్ ఠాకూర్ మంగళవారం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా మెటర్నిటీ వార్డును పరిశీలించి అక్కడ చికిత్స పొందుతున్న బాలింతలు, గర్భిణీ మహిళలు, వారి సహాయకులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం బాలింతలు, గర్భిణీలకు బ్రెడ్, పండ్లను పంపిణీ చేశారు. చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చిన ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడిన ఆమె, ఆసుపత్రిలో ఎదురవుతున్న సమస్యలు లేదా ఇబ్బందులను నిర్భయంగా తెలియజేయాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఆసుపత్రిలోని వైద్య సదుపాయాలు, రోగులకు అందుతున్న సేవలపై కూడా ఆమె వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో



## పచ్చని భవిష్యత్తు కోసం రామగుండం ఏరియా-1లో 10 వేల మొక్కలు నాటిక సింగరేణి





జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 21: పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ సింగరేణి రామగుండం ఏరియా-1లో మంగళవారం భారీ స్థాయిలో మొక్కల నాటకం చేపట్టారు. భారత ప్రభుత్వ "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమంలో భాగంగా, కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, కోల్ కంట్రోలర్ సంస్థ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏరియా పరిధిలో మొత్తం 10 వేల మొక్కలు నాటారు.ప్రధాన కార్యక్రమం ఓసీ-5 ప్రాజెక్టులో జరిగింది. ఎస్.ఓ. టు జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ మొక్క నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బొగ్గు ఉత్పత్తిలోనే కాకుండా పర్యావరణ పరిరక్షణలోనూ సింగరేణి దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రతి ఉద్యోగి ప్రతి ఏడాది కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. మొక్కల పెంపకం ద్వారా స్వచ్ఛమైన గాలి, పర్యావరణ సమతుల్యత, జీవవైవిధ్య పరిరక్షణ సాధ్యమవుతుందని, భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఓసీ-5 ప్రాజెక్టులో 5 వేల, మేడిపల్లి ఓపెన్‌కాస్ట్‌లో 2,500, జీడీకే 1ఉ3 ఇంక్లైన్, జీడీకే 2ఉ2ఏ ఇంక్లైన్, 11 ఇంక్లైన్ గనులు, ఇతర విభాగాల్లో మరో 2,500 మొక్కలు నాటడంతో మొత్తం 10 వేల మొక్కల నాటకం పూర్తయింది. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి రమేష్, అటవీ విభాగం ఉప ప్రధాన నిర్వాహకుడు బానోత్ కర్ణ, ఏరియా పర్యావరణ అధికారి వేణు, స్టాట్యూటరీ మేనేజర్ రమేష్‌బాబు, గ్రూప్ ఏజెంట్ యల్. రమేష్, 11 ఇంక్లైన్ గని ఏజెంట్ చిలుక శ్రీనివాస్, వివిధ విభాగాల అధికారులు, నిర్వాహకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు.

# విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై చైతన్యం..






- **ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ట్రాఫిక్ పోలీసుల అవగాహన సదస్సు**

అక్షరం న్యూస్ । సూర్యాపేట,టౌన్ జూలై 21:

సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పట్టణ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతను వివరించారు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే రోడ్డు భద్రతా నియమాలను అలవర్చుకోవాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని హెచ్చరించారు.బాధ్యతాయుతమైన పౌరులుగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని విద్యార్థులకు సూచించారు.ట్రాఫిక్ ఎస్సై యాదవేంద్ర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, తల్లిదండ్రుల్లో కూడా రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించాలని కోరారు.అనంతరం పోలీస్ కళాబృందం పాటలు, ప్రదర్శనల ద్వారా రోడ్డు భద్రతపై సందేశాలను అందించి విద్యార్థులను ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై యాదవేంద్ర రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యాదయ్య, వైస్ ప్రిన్సిపాల్ వాసు, అధ్యాపకులు ప్రసాద్‌తో పాటు అధ్యాపక బృందం, పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి యల్లయ్య, సభ్యులు గోపయ్య, కృష్ణ, చారి, సత్యం, గురులింగం, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



# నైపుణ్యాలను పెంపొందించడంలో ఎన్ సిసి కీలక పాత్ర పోషిస్తుంది

ఓదెల/ పెద్దపల్లి జులై 21(అక్షరం న్యూస్)

క్రమశిక్షణ.. దేశభక్తికి తొలి మెట్టు

పోత్కపల్లి జడ్‌పీహెచ్‌ఎస్‌లో ఎన్‌సీసీ ప్రవేశాలకు విద్యార్థుల పోటీ

దేశసేవే లక్ష్యంగా యువతకు స్ఫూర్తినిచ్చిన ఎన్‌సీసీ ఎంపికలు -- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

పోత్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ఆసక్తి కనబరిచారు. 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎన్‌సీసీ ప్రవేశాల ఎంపిక కార్యక్రమం సోమవారం పాఠశాల ఆవరణలో ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు.

పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీ పి. భద్రయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి శ్రీ జి. రవి ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన సుబేదార్ విజయ్ కుమార్, హవల్దార్ విపిన్ సింగ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, "ఎన్‌సీసీ అనేది కేవలం ఒక శిక్షణా కార్యక్రమం మాత్రమే కాదు.. ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే గొప్ప వేదిక" అని పేర్కొన్నారు.

విద్యార్థుల్లో దేశసేవా భావం, క్రమశిక్షణ, సమయపాలన, ఆత్మవిశ్వాసం, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించడంలో ఎన్‌సీసీ కీలక పాత్ర పోషిస్తుందని వారు వివరించారు. అంతేకాకుండా ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాలు, సాయుధ దళాల్లో చేరేందుకు ఎన్‌సీసీ అందించే అవకాశాలను కూడా విద్యార్థులకు వివరించారు.



ఎంపికల సందర్భంగా విద్యార్థుల శారీరక దారుఢ్యం, చురుకుదనం, క్రమశిక్షణ, ప్రతిభ, సామర్థ్యాలను పలు పరీక్షల ద్వారా పరిశీలించి అర్హులైన కొత్త క్యాడెట్లను ఎంపిక చేశారు. ప్రతి పరీక్షను నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తూ విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్ శ్రీనివాస్, ఎ కిషోర్ కుమార్, కె.సంజీవ్ తదితరులు పాల్గొని ఎంపిక ప్రక్రియను విజయవంతం చేయడంలో తమ వంతు సహకారం అందించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఎన్‌సీసీలో స్థానం సంపాదించేందుకు తమ ప్రతిభను ప్రదర్శించారు.

చివరగా ఎంపికైన క్యాడెట్లను అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందిస్తూ, క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తిని అలవర్చుకుని జాతీయ స్థాయిలో రాణిస్తూ పాఠశాలకు, గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమం విజయవంతంగా ముగియగా విద్యార్థుల్లో ఎన్‌సీసీపై మరింత ఉత్సాహం, స్ఫూర్తి నెలకొంది.

# దొంతికుంట పరిరక్షణకు ప్రజాగళం... ఆధునీకరణ పనులపై తీవ్ర అభ్యంతరాలు





- రూ.5 కోట్ల పనులతో చెరువు విస్తీర్ణం తగ్గుతోందని ఆరోపణలు
- ఇరిగేషన్ డీఈని నిలదీసిన ఆయకట్టు రైతులు, పట్టణ ప్రజలు
- సర్వే వివరాలు బహిర్గతం చేసి లోపాలు సరిదిద్దాలని డిమాండ్

భద్రాద్రి కొత్తగూడెం / అశ్వారావుపేట / జూలై 21/ అక్షరం న్యూస్ :-అశ్వారావుపేట పట్టణానికి జీవనాడిగా నిలిచిన చారిత్రాత్మక దొంతికుంట చెరువు ఆధునీకరణ పనులపై స్థానిక ప్రజలు, ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు రూ.5 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్ వల్ల చెరువు విస్తీర్ణం తగ్గిపోవడంతో పాటు భవిష్యత్తులో పట్టణం ముంపు ముప్పును ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆరోపిస్తూ మంగళవారం ఇరిగేషన్ డీఈని నిలదీశారు.

### చెరువు విస్తీర్ణం కుదించొద్దని విజ్ఞప్తి

చెరువు చుట్టూ సుమారు ఎనిమిది మీటర్ల వెడల్పుతో వాకింగ్ ట్రాక్ నిర్మించడం వల్ల దాదాపు ఐదు ఎకరాల మేర చెరువు విస్తీర్ణం తగ్గుతోందని రైతులు పేర్కొన్నారు. నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాల్సిన చోట చెరువు వైశాల్యాన్నే తగ్గించడం ప్రజాహితానికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు.

### వర్షపు నీటి మార్గాలపై ఆందోళన

గతంలో ఎమ్మార్వో కార్యాలయం వైపు నుంచి చెరువులోకి వచ్చే సహజ కాలువలపై ఆక్రమణలు జరిగినప్పటికీ వాటిని తొలగించకుండా చెరువు చుట్టూ ఎత్తైన కట్ట నిర్మిస్తున్నారని ఆరోపించారు. దీంతో వర్షపు నీరు చెరువులోకి చేరకుండా శాసనవాటికతో పాటు సమీప కాలనీలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు.

### ముంపు ముప్పు పెరుగుతోందని ఆరోపణ

జంగారెడ్డిగూడెం రోడ్డు నుంచి పట్టణం గుండా చెరువులోకి వెళ్లే తూములు పూడిపోవడం, వర్షపు నీటి ప్రవాహ మార్గాలు మూసుకుపోవడంతో గౌడ్‌బజార్, మంగళబజార్, సంత మార్కెట్ ప్రాంతాలు స్వల్ప వర్షాలకే జలమయమవుతున్నాయని స్థానికులు తెలిపారు.

### ఇన్‌ఫ్లో--అవుట్‌ఫ్లో వ్యవస్థలో మార్పులు చేయాలి

చెరువులోకి నీరు వచ్చే మార్గం, బయటకు వెళ్లే మార్గాన్ని ఒకే విధంగా రూపొందించడం సరికాదని రైతులు పేర్కొన్నారు. శాస్త్రీయ విధానంలో ప్రత్యేక ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వ్యవస్థను ఏర్పాటు చేసి నీటి ప్రవాహం సాఫీగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### సర్వే మ్యాప్‌ను ప్రజల ముందుంచాలి

ఈ పనులకు సంబంధించి రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు నిర్వహించిన ఉమ్మడి సర్వే వివరాలు, మ్యాప్‌ను తక్షణమే ప్రజల సమక్షంలో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. చెరువు ఇన్‌ఫ్లో కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగించి, పూడిపోయిన తూములను శుభ్రం చేయాలని, వాకింగ్ ట్రాక్ వద్ద అవసరమైన చోట భారీ పైపులు, తోరలు ఏర్పాటు చేసి వర్షపు నీరు నిరాటంకంగా చెరువులోకి చేరేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

లోపాలను వెంటనే సరిదిద్దకపోతే రానున్న వర్షాకాలంలో అశ్వారావుపేట పట్టణం ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని, అలాంటి పరిస్థితులు తలెత్తితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాలని ప్రజలు హెచ్చరించారు. దొంతికుంట ఆధునీకరణ పనులపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు, పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేశారు.

# కరాటేలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ గుర్తింపు సాధించిన ఎన్టీపీసీ విద్యార్థినులు

జ్యోతినగర్, ఎన్టిపిసి జూలై 21 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్

రామగుండం ఎన్టీపీసీ జ్యోతినగర్‌కు చెందిన అక్కాచెల్లెళ్లు హేమలత మాజీ, కీర్తి మాజీ కరాటేలో ప్రతిభ కనబరిచి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ గుర్తింపు పొందారు. హైదరాబాద్‌లో నిర్వహించిన అతిపెద్ద కరాటే ప్రదర్శనలో పాల్గొని ఈ అరుదైన ఘనతను సాధించారని కరాటే శిక్షకుడు శ్రీనివాస్ మంగళవారం తెలిపారు.

హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో విజన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ, జీఆర్ ఇంటర్నేషనల్ టెక్ మెండో అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ కరాటే ప్రదర్శనలో వేలాది మంది క్రీడాకారులతో కలిసి హేమలత మాజీ, కీర్తి మాజీ అద్భుత ప్రదర్శన కనబరిచి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ గుర్తింపును అందుకున్నారు.

హేమలత మాజీ ఆరో తరగతి, కీర్తి మాజీ నాలుగో తరగతి చదువుతూ జ్యోతినగర్‌లోని సెయింట్ క్లేయిర్ హై స్కూల్‌లో





విద్యనభ్యసిస్తున్నారు. వీరు ఎన్టీపీసీ ఇండియన్ కాఫీ హౌస్ ఉద్యోగి సూక్ దేవ్ మాజీ కుమార్తెలు. చిన్న వయసులోనే చదువుతో పాటు కరాటేలోనూ విశేష ప్రతిభ కనబరుస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పలు అవార్డులు సాధించారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డ్ గుర్తింపు పొందిన ఈ ఇద్దరు విద్యార్థినులను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, పాఠశాల ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు అభినందించారు.

కృషి, క్రమశిక్షణ, పట్టుదల ఉంటే చిన్న వయసులోనే ప్రపంచ స్థాయిలో గుర్తింపు సాధించవచ్చని హేమలత, కీర్తి విజయాలు మరోసారి నిరూపించాయని స్థానికులు కొనియాడుతున్నారు. వీరి విజయం ప్రాంత యువతకు, విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అభిప్రాయపడుతున్నారు.

# విద్యతో పాటు వైద్య రంగాలను మరింత బలోపేతం చేయాలి




జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ )జూలై 21: విద్యతో పాటు వైద్య రంగాలను ప్రభుత్వంమరింతబలోపేతం చేయాలని, అలాగే రైతులుపండించినపంటలకుగిట్టుబాటుధరకల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు గంగాపురం మహేందర్ అన్నారు మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలోమంగళవారంజరిగినముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్యులు, సిబ్బంది, మందుల కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వపాఠశాలల్లోఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు, మౌలిక సదుపాయాల లేమితో విద్యార్థులు భవష్యత్తు దెబ్బతినే ప్రమాదముందని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఆర్థిక సంక్షోభాన్నిఎదుర్కొంటున్నారని అన్నారు.ప్రజల ప్రాథమిక హక్కులైన విద్య, వైద్య రంగాల సమస్యలతో పాటు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నా కార్యక్రమానికి రైతులు, విద్యార్థులు, మహిళలు, యువత, కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం మండల కమిటీ సభ్యుడు కడారి ఐలయ్య, శాగ సాంబరాజు, ఎండి.జమాల్, అంజయ్య, వెంకటయ్య. ఎండి.పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఓయో రూమ్స్‌కు రావాలంటూ వేధింపులు.. నిరాకరించడంతో చంపేస్తానని బెదిరింపులు

హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూలై 21/అక్షరం న్యూస్:-

హనుమకొండ జిల్లాభీమదేవరపల్లి మండలానికి చెందిన ఓ వివాహితను అసభ్యకరంగా వేధిస్తూ. ఓయో రూమ్స్‌కు రావాలని ఒత్తిడి చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ముల్కనూర్ ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గట్ల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన పెదవేనా హరికృష్ణ బాధిత మహిళను పలుమార్లు వేధించి. ఓయో రూమ్స్‌కు రావాలని ఒత్తిడి చేశాడు. అందుకు ఆమె నిరాకరించడంతో ఆమెను ఆమె కుమారుడిని చంపేస్తానంటూ బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

బాధితురాలి ఫిర్యాదు మేరకు హరికృష్ణపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై రాజు తెలిపారు. మహిళలపై వేధింపులకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

# కోర్ట్ చౌరస్తాలో హైమాస్ట్ లైట్లు ప్రారంభం

- అశోక్‌నగర్ వరకు సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ



జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 21 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: రామగుండం నగరంలోని 50వ డివిజన్ పరిధిలో ప్రజల భద్రత, రాత్రి వేళల్లో మెరుగైన వెలుతురు కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. కోర్ట్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్‌తో పాటు అక్కడి నుంచి అశోక్‌నగర్ మజీద్ వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను, అశోక్‌నగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన మరో హైమాస్ట్ లైట్‌ను ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు.మేయర్ మహంకాళి స్వామి చొరవతో, 50వ డివిజన్ కార్పొరేటర్ ధూళికట్ట సతీష్ ఆధ్వర్యంలో ఈ అభివృద్ధి పనులు చేపట్టారు. ఎన్నో రోజులుగా స్థానికులు ఎదుర్కొంటున్న వెలుతురు



సమస్యను పరిష్కరించేందుకు ఈ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పనులతో ప్రజలకు రాత్రి వేళల్లో సురక్షితమైన రాకపోకలకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, సీనియర్ నాయకుడు మాదరబోయిన రవి కుమార్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ నాయకులు ధూళికట్ట కుమార్, కట్కూరి క్రాంతి, కొమ్ము శ్రీనివాస్, కాగితం శ్రీనివాస్, పుల్యాల రమేష్, గాలిపెల్లి రాజేష్, కల్లెపెల్లి సాగర్, తాజ్, సాజీద్, వాజీద్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పెట్టుబడిదారుల చేతుల్లోనే మీడియా రంగం





- ప్రధాన పత్రికల వైఫల్యమే సోషల్ మీడియా విజృంభన
- వాస్తవ సమాచారాన్ని ప్రజలకు అందించడమే పాత్రికేయుల కర్తవ్యం
- మునీర్ బాభాయ్ పుస్తక పరిచయ సభలో
- కే. శ్రీనివాసరెడ్డి, చైర్మన్ రాష్ట్ర మీడియా అకాడమీ

జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 21 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ప్రజల పక్షాన నిలిచి, నిష్పక్షపాతంగా పనిచేసినప్పుడే జర్నలిస్టులకు ప్రజల గుండెల్లో స్థానం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ప్రెస్ క్లబ్ - గోదావరిఖని సౌజన్యంతో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో మంగళవారం జరిగిన ప్రోలిటేరియన్ జర్నలిస్ట్ మునీర్ బాయ్ పుస్తక పరిచయ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతదేశంలో పెట్టుబడి దారుల చేతుల్లోకి మీడియా రంగం వెళ్లిపోయిందని అన్నారు. గడిచిన 12 సంవత్సరాలలో ప్రధానమంత్రి కనీసం ఒక్క మీడియా సమావేశం కూడా ఏర్పాటు చేయలేదని ఇది ప్రజాస్వామ్యానికి, ప్రజలకు నష్టదాయకమని పేర్కొన్నారు. జర్నలిజాన్ని నమ్ముకుని జీవితాంతం అన్యాయాన్ని, ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ, పాలకుల లోపాలను ఎత్తిచూపుతూ ఎన్నో కష్టాలను ఎదుర్కొన్న జర్నలిస్ట్ మునీర్ జీవితం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. నిర్భయంగా, ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా, వాస్తవ సమాచారాన్ని ప్రజలకు అందించడమే జర్నలిస్టుల కర్తవ్యం అని ఆయన ఉద్బోధించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్స్ వలన సమాజంలో నాలుగవ స్తంభంగా నిలబడిన జర్నలిస్టులను, దుకాణాలలో పనిచేసే కూలీలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చారని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. జర్నలిస్టుల జీతభత్యాల పెరుగుదలకు మరో సమరశీల పోరాటం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అప్రజాస్వామికంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. ప్రధాన పత్రికా రంగంలో వృత్తి నిబద్ధత కోల్పోవడం వలన సోషల్ మీడియాకు ఆదరణ పెరిగిందని తేల్చి చెప్పారు. సోషల్ మీడియాలో వచ్చే కొన్ని కథనాలు వాస్తవానికి దూరంగా ఉంటున్నాయని, వాటిపై ఎలాంటి తనిఖీ, నియంత్రణ లేకపోవడం వల్ల విచ్చలవిడితనం పెరిగిపోతున్నదని దీనిని కట్టడి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

ఆదర్శప్రాయుడు మునీర్అక్షరాలను నమ్ముకుని జీవితాంతం పనిచేసిన మునీర్ జీవితం ఆచరణీయమని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ కొనియాడారు. ముఖ్యమంత్రిలతో సన్నిహిత సంబంధాలు ఉన్నప్పటికీ సామాన్యమైన జీవితాన్ని గడుపుతూ, ప్రజల కోసమే మునీర్ పనిచేశాడని ఆయన పేర్కొన్నాడు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని ఆయన పేర్కొన్నారు. కోల్ బెల్ట్ జర్నలిస్టులు ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచారని అన్నారు. మునీర్ జీవితంపై పరిశోధన చేయాలని సూచించారు.

అక్షర ఫౌండేషన్ అధ్యక్షుడు మాదాసి రామమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో రామగుండం కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య ఐజేయు టీయూడబ్ల్యూజే జాతీయ నాయకుడు నగునూరి శేఖర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంపత్ కుమార్ జిల్లా అధ్యక్షుడు మల్లా వజుల వంశీ, గోదావరిఖని ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు డి మాధవరావు గడ్డం శ్యామ్ కుమార్, ఇఫ్తా జాతీయ నాయకులు కే స్వామి కార్మిక సంఘాల నాయకులు తుమ్మల రాజిరెడ్డి రియాజ్ అహ్మద్ పర్లపల్లి రవి ఐ కృష్ణ పి.మల్లికార్జున్ శ్రోతులు కె విశ్వనాథ్ తోకల రమేష్ రచయిత నక్క వెంకట్రావు, పుస్తక సమీక్షను హెచ్ రవీందర్ నిర్వహించారు. అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ, ఏలేశ్వరం వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాల నాయకులు గాండ్ల శ్రీనివాస్, బక్క రవి, శేఖర్, కోల లక్ష్మణ్, పాలకుర్తి విజయకుమార్, మామిడి సత్యనారాయణ, మనోహర్ రెడ్డి, సుధాకర్ రావు, జేవి రాజు,శ్రీపతి రాజగోపాల్,మైనార్టీ నాయకులు హమీద్, మాల మహానాడు నాయకులు మద్రి ఐలయ్య, పిట్టల వెంకటి, నంది నరేష్, ప్రజానాట్యమండలి కళాకారులు కన్నం లక్ష్మీనారాయణ, చీకటి అంజయ్య, ఎజ్జ రాజయ్య, దయా నర్సింగ్ జనగామ రాయనర్స్ పద్మ రమ తదితరులు పాల్గొన్నారు





## దేవాదుల నార్త్ కెనాల్ ద్వారా వెంటనే సాగునీరు విడుదల చేయాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్ విజ్ఞప్తి..

హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూలై 21/అక్షరం న్యూస్:-



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల రైతుల ప్రయోజనాల దృష్ట్యా దేవాదుల నార్త్ కెనాల్ ద్వారా వెంటనే సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు.

ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగు చేసిన పంటలు ఎండిపోయే ప్రమాదంలో ఉన్నాయని ఈ నేపథ్యంలో నార్త్ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేస్తే వేలాది ఎకరాల్లో సాగు చేస్తున్న రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లోని రైతాంగం పూర్తిగా ఈ కాలువపైనే ఆధారపడి ఉందని నీటి విడుదలలో జాప్యం జరిగితే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆదరి శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకుని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి వెంటనే సాగునీటిని విడుదల చేయాలని ఆయన కోరారు.

## బీజేపీమండల ప్రధాన కార్యదర్శిగా దొంగల రాణాప్రతాప్ నియామకం

- మూడు తరాలుగాకమలానికి అండగా దొంగల కుటుంబం..

హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూలై21/అక్షరం న్యూస్:-



జనసంఘ్ కాలం నుంచి భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలను గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించేందుకు కృషి చేస్తున్న దొంగల కుటుంబానికి చెందిన యువ నాయకుడు దొంగల రాణాప్రతాప్ హనుమకొండ జిల్లాభీమదేవరపల్లి మండల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ నియామకంతో మూడు తరాలుగా పార్టీతో కొనసాగుతున్న వారి కుటుంబ సేవలకు గుర్తింపు లభించినట్లు పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. దొంగల రాణాప్రతాప్ తాత దొంగల వెంకట్రాజం జనసంఘ్ రోజుల నుంచే జాతీయ భావజాల ప్రచారంలో చురుకుగా పాల్గొంటూ గ్రామాల్లో పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారు. అనంతరం ఆయన కుమారుడు దొంగల కొమురయ్య భారతీయ జనతా పార్టీలో నిబద్ధతతో పనిచేస్తూ జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేయడంతో పాటు పార్టీ విస్తరణ కోసం ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఇప్పుడు అదే కుటుంబానికి చెందిన దొంగల రాణాప్రతాప్ మండల ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టడం విశేషంగా మారింది. పార్టీ తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ భీమదేవరపల్లి మండలంలో బీజేపీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు.ఈ సందర్భంగా తనకు అవకాశం కల్పించిన మండల అధ్యక్షుడు శ్రీరామోజు శ్రీనివాస్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్,సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బేరి శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకటేశం, కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, గుర్రాల లక్ష్మారెడ్డి, పైడిపల్లి పృథ్వీరాజ్, మాచర్ల కుమారస్వామి, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వంతో పాటు నియామకానికి సహకరించిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు రాణాప్రతాప్ కృతజ్ఞతలు తెలిపారు.

## సర్ అప్లికేషన్స్ పై అవగాహన కల్పించిన... కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ చాంద్ పాషా



శేరిలింగంపల్లి సర్ కార్యక్రమంలో భాగంగా అప్లికేషన్ ఫామ్స్ ఏ విధంగా నింపాలి అనే అంశంపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ చాంద్ పాషా, వారి బృందం ఆధ్వర్యంలో అప్లికేషన్ ఫామ్స్ నింపి, ఓటర్స్ కు అవగాహన కల్పించారు. పలు కాలనీలలో అప్లికేషన్ ఫామ్స్ నింపి బిఎల్ఓ లకు అందివ్వడం జరిగింది. ప్రతి పౌరుడు తమ ఓటు ప్రధానంగా భావించి ఎస్.ఐ.ఆర్ అప్లికేషన్ అప్లై చేసుకోవాలని అన్నారు. మార్తాండ నగర్, ప్రేమ్ నగర్ ఏడబి బ్లాక్, శ్రీరామ్నగర్, కొండాపూర్ బెటాలియన్, గౌతమి నగర్, కొత్తగూడ తదితర ప్రాంతాల్లో సర్ అప్లికేషన్స్ పూర్తి చేసి సంబంధిత బిఎల్ఓ లకు అందించడం జరిగింది.

## కల్వచర్లలో దుర్గమ్మ కొలుపుకు ఏర్పాట్లు పూర్తి



రామగిరి, జూలై 21 (అక్షరం న్యూస్):

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని కల్వచర్ల గ్రామంలో గ్రామదేవత పెద్దదేవర (దుర్గమ్మ) అమ్మవారి రెండురోజుల కొలుపు జాతరకు గ్రామ ప్రజలు ఘనంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆషాఢమాసంలో గ్రామదేవతలకు బోనాలు సమర్పించడం తెలంగాణ సాంప్రదాయంలో విశిష్టమైన ఆచారం. ఇందులో భాగంగా కల్వచర్లలోని పోచమ్మగుడి ఆవరణలో కొలువై ఉన్న పెద్దదేవర అమ్మవారికి తొలిఏకాదశి పండుగకు ముందు ప్రతి సంవత్సరం భక్తులు మొక్కుబడిగా బోనాలు సమర్పిస్తారు.ప్రతి ఐదేళ్లకోసారి మాత్రమే దుబ్బుల పూజారుల ఆధ్వర్యంలో రెండురోజుల పాటు వైభవంగా కొలుపు జాతర నిర్వహించడం ఆనవాయితీ. గత కొలుపు జరిగి నాలుగేళ్లు పూర్తికావడంతో ఈ నెల 22, 23 తేదీల్లో (బుధ, గురువారాలు) కొలుపు జాతరను నిర్వహించేందుకు గ్రామంలోని వివిధ కుల సంఘాల ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ జాతర నిర్వహణకు అవసరమైన ఖర్చును అమ్మవారి భక్తులైన సుమారు 300 కుటుంబాలు భరిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.జాతర రెండో రోజు గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలో సుఖశాంతులు, ఆరోగ్యం, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, గ్రామానికి ఎటువంటి రోగాలు, ఆపదలు రాకుండా కాపాడాలని ప్రార్థనలు చేస్తారు. అనంతరం అమ్మవారికి బలిచ్చిన మేక రక్తంతో తడిపిన జొన్న ఘట్క సర్వును స్వీకరించి ప్రతి ఇంటి ఆవరణలో చల్లే సంప్రదాయాన్ని పాటిస్తారు. చివరగా అమ్మవారికి బలిచ్చిన మేకలతో గ్రామస్తులు కుటుంబ సమేతంగా సామూహిక భోజనాలు చేసి కొలుపు జాతరను ముగిస్తారు.ఈ కొలుపు జాతరలో మున్నూరు కాపు, పద్మశాలి, గౌడ, ముదిరాజు, యాదవ, మాదిగ, మాల, రజక, కుర్మ, మేరు, మంగలి, కుమ్మరి, మేదరి తదితర కులాల ప్రజలు అందరూ సంయుక్తంగా పాల్గొని గ్రామ ఐక్యతను చాటనున్నారు. కల్వచర్ల గ్రామస్తులు, పెద్దదేవర (దుర్గమ్మ) భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని గ్రామ కుల సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

## చోరీలకు పాల్పడుతున్న బాల నేరస్థులనుఅరెస్టు చేసినచందానగర్ పోలీసులు



చందానగర్ క్రైమ్ న్యూస్ ప్రతినిధి: చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడిన ఇద్దరు బాల నేరస్థులు అరెస్టు చేశారు. వీరిపై పలు పోలీస్ స్టేషన్లో 7 కేసులు ఉన్నాయి, 7 వాహనాల స్వాధీనం, వీరిపై చందానగర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నెం 628/2026, యు/సెక్షన్ బి.ఎన్.ఎస్/సెక్షన్.305 (బి) బి.ఎన్.ఎస్ కేసు దర్యాప్తులో భాగంగా, 21-07-2026 తెల్లవారుజామున లింగంపల్లి రైల్వే స్టేషన్ రోడ్డులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు బాల నేరస్థులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, చందానగర్, ఐడీఏ బొల్లారం, జగద్గిరిగుట్ట, మియాపూర్, బాచుపల్లి పోలీస్ స్టేషన్‌ల పరిధిలో మొత్తం 7 ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు.

వారు స్వచ్ఛందంగా ఒప్పుకొని వారు ఎక్కడ వాహనాలు దొంగలించారో చూపించడం జరిగింది. నిందితులను జువెనైల్ జస్టిస్ బోర్డు, ఎల్.బి.నగర్ వారి ఎదుట హాజరుపరచి అబ్జర్వేషన్ హోమ్ రిమాండ్ కోరుతూ నివేదిక సమర్పించారు. కేసులో చందానగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వి. జనయ్య ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టి, కేసును విజయవంతంగా ఛేదించి నిందితులను పట్టుకోవడంతో పాటు దొంగిలించబడిన వాహనాలను స్వాధీనం చేసుకోవడంలో విశేష ప్రతిభ కనబరిచిన చందానగర్ పోలీస్ స్టేషన్ పోలీసు కానిస్టేబుళ్లు ప్రభాకర్, ఆది శ్రీనివాస్, గోపీకృష్ణ, రాజు లను ఉన్నతాధికారులు అభినందించారు.

**చందానగర్ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి:**

ద్విచక్ర వాహనాలను ఎల్లప్పుడూ సురక్షిత ప్రదేశాల్లో పార్క్ చేసి హ్యాండిల్ లాక్‌తో పాటు అదనపు భద్రతా లాక్‌లు వినియోగించాలి. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల గురించి సమాచారం ఉంటే వెంటనే డయల్-108 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి.

## అంగన్వాడీ ఆయమ్మ ఔదార్యం

• పసి పిల్లలకు స్కూల్ బ్యాగ్ ల పంపిణీ.



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూలై 21 / : ఆమె చేసేది చిన్న ఉద్యోగం, పిల్లలంటే ఆమెకు ఎంతో ప్రేమ, వారిని బడికి పంపడానికి నిత్యం ప్రయత్నిస్తోంది ఓ అంగన్వాడీ ఆయమ్మ. "సొంత లాభం కొంత మానుకొని పొరుగు వారికి తోడ్పడవోయి" అన్న మహాకవి గురజాడ అప్పారావు స్ఫూర్తితో అంగన్వాడీ పిల్లలకు స్కూల్ బ్యాగ్ లు పంపిణీ చేసి ఆదర్శంగా నిలిచిందో అంగన్వాడీ ఆయమ్మ. వివరాల్లోకి వెళితే భువనగిరి మండలం చందుపట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని మదిర కుమ్మరిగుడెం అంగన్వాడీ కేంద్రంలో "ఆయా" గా పనిచేస్తున్న దంతూరి ప్రేమలత చిన్న పిల్లలకు స్కూల్ బ్యాగులను, బహుమతిగా అందించి పిల్లలను ప్రోత్సహిస్తుంది. స్కూల్ బ్యాగ్ లే కాకుండా పలకలు, నోట్ పుస్తకాలు, పెన్నులు, ఆట వస్తువులు మరియు బొమ్మలు ఇచ్చి పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు, ప్రాథమిక పాఠశాలలకు వెళ్ళే విధంగా కృషి చేస్తుంది ఈ అంగన్వాడీ ఆయమ్మ. అంగన్వాడీ ఆయమ్మ ను ఆదర్శంగా తీసుకుని పిల్లలందరూ పాఠశాలకు వెళ్ళే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు మేధావులు, విద్యావేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కుమ్మరి గూడెం అంగన్వాడీ ఆయా ప్రేమలత ను అభినందించారు.

## "చలో బెంగుళూరు"

• 'ఓబిసి మహాసభ" వాల్ పోస్టర్లను విడుదల చేసిన ఎమ్మెల్యే బీర్ల ఐలన్న



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూలై 21 / : మంగళవారం దేశ వ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని విస్తరించడంలో భాగంగా బీసీ రిజర్వేషన్ల ఆరాధ్యులు బీపీ మండల్ డే సందర్భంగా ఆగస్టు 7న బెంగళూరులో జరగబోయే అఖిల భారత జాతీయ ఓబీసీ 11వ మహాసభ వాల్ పోస్టర్లను మంగళవారం రోజు ఆలేరు నియోజకవర్గము లో, బీసీ సంక్షేమ సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో, జిల్లా అధ్యక్షుడు కొత్త నరసింహ స్వామి అధ్యక్షతన జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఆలేరు నియోజకవర్గం శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలన్న ముఖ్యఅతిథిగా హాజరై వారి చేతుల మీదుగా "చలో బెంగుళూరు" ఓ బి సి జాతీయ మహాసభ వాల్పోస్టర్లను విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం భువనగిరి నియోజకవర్గ అధ్యక్షులు సాబన్ కార్ వెంకటేష్, ఆలేరు నియోజకవర్గం అధ్యక్షులు పేరపు రాములు, భువనగిరి మండల అధ్యక్షులు జిన్న మల్లేష్, తుర్కపల్లి మండల అధ్యక్షుడు ఎరుకల వెంకటేష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు సాంబేష్, వివిధ బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు...

## నోట్ బుక్కుల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ను ఆహ్వానించిన జూపల్లి సురేష్



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూలై 21 / : మంగళవారం రోజు తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామానికి చెందిన జూపల్లి సంపత్ జ్ఞాపకార్థం గ్రామంలోని పాఠశాలలో నోటుబుక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరుకావాలని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను హైదరాబాదులో జూపల్లి సురేష్ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొత్త రాములు, సీనియర్ నాయకులు జింకల ఎల్లేష్ యాదవ్, పెద్దగొల్లకిష్టయ్య గ్రామ శాఖ అధ్యక్షులు గజం వంశీ బుద్ధి శ్రీశైలం సాప మహేష్ గ్రామస్తులు పాల్గొన్నారు...

## ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసిన హర్కర వేణుగోపాల్ రావు



జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 21 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గేను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రజా సంబంధాలు, ప్రోటోకాల్ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు మంగళవారం న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఖర్గే జన్మదిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హర్కర వేణుగోపాల్ రావు మాట్లాడుతూ మల్లికార్జున ఖర్గే దేశ రాజకీయాల్లో విలువలకు ప్రతీకగా నిలిచిన నాయకుడని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడిగా ఆయనను అభినందించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సమర్థవంతమైన నాయకత్వాన్ని అందిస్తున్న ఖర్గే సంపూర్ణ ఆయురారోగ్యాలతో, దీర్ఘాయుష్షుతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ మరోసారి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## పాలంచ పట్టణంలో.. క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ కేంద్రం ఏర్పాటుకు సానుకూలంగా స్పందించిన

• జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ భద్రాచలం టౌన్ జూలై 21 (అక్షరం న్యూస్)

గిరిజన సంక్షేమం కొరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో క్యాన్సర్ వ్యాధి కేసు ఎక్కువగా నమోదవుతున్నాయని వాటి నివారణ కొరకు క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ కేంద్రం ఏర్పాటు చేయాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బృందం జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ సానుకూలంగా స్పందించి, తగు చర్యలు చేపడతామని తెలిపారని జిల్లా కో.. కోఆర్డినేటర్ డాక్టర్. ఎస్ ఎల్ కాంతారావు తెలియజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. గిరిజన ప్రాంతాల్లో వైద్యం సదుపాయాలు విస్తృతంగా ఏర్పాటుకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ఆదేశాలతో సెక్రటరీ టు గవర్నర్ దాన కిషోర్, రాష్ట్ర ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి ఏ శ్రీరాములు సూచనలతో ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్. అడిషనల్ కలెక్టర్ డి వేణుగోపాల్. పాలవంచలో ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ భావన నిర్మాణానికి 0.10 జి

టిపి స్థలాన్ని కేటాయించాలని, ఈ స్థలము నందు ప్రత్యేక వైద్య కేంద్రం ఏర్పాటు చేయాలని అందులో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ, చేత డయాలసిస్ సెంటర్, బ్లడ్ బ్యాంక్.. ఏర్పాటు చేయాలని దీనివలన గిరిజన సంక్షేమం. ఉచిత వైద్య సదుపాయాలు విస్తృత పరచాలని కోరగా జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి తగు చర్యలు చేపడతామని తెలుపగా వారికి రెడ్ క్రాస్ సంస్థ తరఫున డాక్టర్ ఎస్ ఎల్ కాంతారావు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వై సూర్యనారాయణ, జి రాజారెడ్డి, వి కామేశ్వరరావు, చావా లక్ష్మీనారాయణ , చారుగుళ్ళ శ్రీనివాస్, డాక్టర్ భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మరకత శివాలయంలో ఇస్రో రిటైర్డ్ సీనియర్ సైంటిస్ట్ శ్రీనివాసులు దంపతులు ప్రత్యేక పూజలు.



రంగారెడ్డి జిల్లా :శంకర్పల్లి :జులై 21: అక్షరం న్యూస్ –: శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11 వ శతాబ్దానికి చెందిన మరకత శివాలయంలో మంగళవారం ఇస్రో రిటైర్డ్ సీనియర్ సైంటిస్ట్ శ్రీనివాసులు, కృష్ణవేణి దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ కడకంచి కుమార్ యాదవ్, ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్ రాజు స్వామి, వైస్ చైర్మన్ నర్సింలు వారిని స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేసి, స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు. కార్యక్రమంలో అర్చకులు సాయి శివ, కమిటీ సభ్యులు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై లాఠీచార్జిని తీవ్రంగా ఖండించిన

• వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్.

• విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోంది"

• కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి..



కట్ల సంతోష్.

ఖమ్మం జిల్లా /వైరా / జూలై 21 / అక్షరం న్యూస్ –:

ఢిల్లీలో విద్యార్థులు, యువత చేపట్టిన శాంతియుత నిరసనపై పోలీసులు లాఠీచార్జి చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ తీవ్రంగా ఖండించారు. విద్యా వ్యవస్థలో నెలకొన్న అవకతవకలు, నీట్, జేఈఈ పరీక్షల పేపర్ లీకేజీలు తదితర అంశాలపై పార్లమెంట్‌కు ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు, యువతపై ఢిల్లీ పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి రోడ్డుపై ఈడ్చుకుంటూ విచక్షణారహితంగా లాఠీచార్జి చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం దారుణమని ఆయన పేర్కొన్నారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విద్యార్థుల భవిష్యత్తును కాపాడాల్సింది పోయి వారి గొంతును అణచివేసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. విద్యా వ్యవస్థలో జరిగిన వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశ చరిత్రలో ఈ ఘటన ఒక చీకటి రోజుగా నిలిచిపోతుందని పేర్కొన్న కట్ల సంతోష్, విద్యార్థులపై నమోదు చేసిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, ఈ ఘటనపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సుమోటోగా స్వీకరించి సమగ్ర నివేదిక తెప్పించి, విద్యార్థుల హక్కుల ఉల్లంఘనకు బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులు తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలిపే రాజ్యాంగబద్ధ హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, బలప్రయోగంతో ఉద్యమాలను అణచివేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని కట్ల సంతోష్ పేర్కొన్నారు.

## వర్షపు నీటిని ఒడిసి పట్టండి

• జీవితానికి భరోసా ఇవ్వండి ..

• క్యాచ్ ది రైయిన్ కార్యక్రమంలో

• కౌన్సిలర్ నిమ్మ తోట శ్రావణి




ఖమ్మం జిల్లా / వైరా / జూలై 21 / అక్షరం న్యూస్ –:

వైరా మున్సిపాలిటీ పరిధిలో 4వ వార్డు, ఫిషెస్ కాలనీ "జల్ సంచయ్ జన్ భాగిధారి" (జే.ఎస్.జే.బి) 3.0కార్యక్రమం. నిర్వహించారు జల్ సంచయ్ జన్ భాగిధారి (జే.ఎస్.జే.బి) 3.0 కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలందరూ భాగస్వాములు కావాలిఅని వైరా మున్సిపాలిటీ పరిధిలోని , భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జల్ సంచయ్ జన్ భాగిధారి (జే.ఎస్.జే.బి) 3.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతిపౌరుడు తనవంతు బాధ్యతగా పాల్గొనవలసిందిగా కోరారు. ఈసందర్భంగా వైరా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, వ్యాపారసంస్థలు, స్వచ్ఛందసంస్థలు మరియు యువత అందరూ ఈకార్యక్రమంలో చురుకుగా పాల్గొని వర్షపు నీటిసంరక్షణ చర్యలను చేపట్టాలని, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, నీటివృథాను నివారించాలని, భూగర్భజలాలనుపెంపొందించాలని, చెరువులు పరిరక్షించాలని, ప్రతిఇంటిలో వర్షపునీటిసంరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఇంటివద్ద వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా భూగర్భ జలమట్టం పెరుగుటకు, భవిష్యత్ తరాలకు తగిన నీటి భద్రత కల్పించుటకు మరియు పర్యావరణ పరిరక్షణకు మనమందరం తోడ్పడవచ్చు. నీటిప్రతిబొట్టు అమూల్యమైనది. భవిష్యత్తరాలకు నీటిభద్రతను కల్పించాలంటే ప్రతిపౌరుడు బాధ్యతతో వ్యవహరించి నీటిసంరక్షణలో భాగస్వామి కావాలి. ప్రజల సహకారంతోనే ఈకార్యక్రమం విజయవంతమవుతుందని, అందరూ స్వచ్ఛందంగా పాల్గొని "జల్ సంచయ్ జన్ భాగిధారి"కార్యక్రమాన్నివిజయవంతం చేయాలని విజ్ఞప్తిచేయడమైనది ఈప్రజాఉద్యమాన్నివిజయవతంచేయడానికి. వైరామున్సిపాలిటీతో కలిసి ప్రతిపౌరుడు స్వచ్ఛందంగా పాల్గొని నీటిసంరక్షణకు కట్టుబడి ముందుకు రావలసిందిగా పేర్కొన్నారు. కార్యక్రమం లో కౌన్సిలర్ నిమ్మ తోట శ్రావణి టి పి బి ఓ మల్లేష్ మెప్మా ఆర్ పి విజయలక్ష్మివార్డు ప్రజలు పాల్గొన్నారు.

## రాష్ట్ర చైర్మన్ సత్యనారాయణను కలిసిన వైస్ చైర్మన్ నారపోగు వెంకటేశ్వర్లు



ఖమ్మం జిల్లా /తల్లాడ టౌన్ జూలై 21 (అక్షరం న్యూస్)

టీపీసీసీ ఎస్సీ డిపార్ట్ మెంట్ రాష్ట్ర చైర్మన్, మానుకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను రాష్ట్ర ఎస్సీ విభాగం వైస్ చైర్మన్ నారపోగు వెంకటేశ్వర్లు కలిశారు. మంగళవారం మానుకొండూరులో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఒకరినొకరు బాగోగులు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో టీపీసీసీ ఎస్సీ



విభాగం బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలన్నారు. అనంతరం ఇరువురు రాష్ట్రంలో ఎస్సీ విభాగం బలోపేతం తదితర విషయాల గురించి చర్చించుకున్నారు.

# ఆయిల్ పామ్ సాగు రైతుల ఆర్థిక స్థిరత్వానికి బలమైన పునాది

- గిరిజన కుటుంబాల ఆదాయం పెరిగితేనే పిల్లల భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉంటుంది.
- మరో 10 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరిస్తే పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు.
- ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవాలంటే పంటల మార్పిడే ప్రత్యామ్నాయం.
- ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి పొలంలో ఫామ్ పాండ్ నిర్మించుకోవాలి.
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు గోదావరి జలాలు అందించడమే నా జీవిత లక్ష్యం.
- రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / ములకలపల్లి /జూలై 21 / అక్షరం న్యూస్ –:

ములకలపల్లి మండలంలో మంగళవారం నిర్వహించిన ఆయిల్ పామ్ రైతుల ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ సాగు విస్తరణ, ఎల్‌నినో పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, నీటి సంరక్షణ, గోదావరి జలాల వినియోగం తదితర అంశాలపై రైతులకు దిశానిర్దేశం చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ... గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గిరిజనులకు రహదారులు, తాగునీరు, విద్యుత్, వైద్యం, విద్య వంటి మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు, ప్రతి మండలంలో గురుకులాలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. గిరిజన పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి కలెక్టర్లు, ఉన్నతాధికారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అడవుల విస్తీర్ణం తగ్గిపోవడంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని, అడవి జంతువులు గ్రామాల్లోకి వస్తున్నాయని పేర్కొన్నారు. మర్రి, వెదురు, చింత వంటి స్థానిక జాతుల మొక్కలను విస్తృతంగా నాటి అడవులను పరిరక్షించాలని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో ఇప్పటికే 35 శాతం వర్షపాతం లోటు నమోదైందని, భూగర్భ జలాలు కూడా తగ్గుముఖం పట్టాయని తెలిపారు. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కూడా సాధారణం కంటే 20 నుంచి 30 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున బోర్లపై ఆధారపడి వరి సాగు చేయకుండా తక్కువ నీటి అవసరం ఉన్న ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. పెసర, మినుము, కంది, అలసంద వంటి అపరాల సాగును విస్తరించాలని కోరారు. పత్తి సాగు చేసే రైతులు ప్రతి నాలుగు లేదా ఆరు వరుసలకు ఒక వరుస కందిని అంతర పంటగా సాగు చేస్తే అదనపు ఆదాయం లభించడంతో పాటు భూమి సారం పెరుగుతుందని తెలిపారు. ములకలపల్లి మండలంలో ప్రస్తుతం 8 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, మరో 10 వేల ఎకరాల్లో సాగు విస్తరిస్తే వెంటనే పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తామని మంత్రి ప్రకటించారు. పోడు భూముల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి సౌర విద్యుత్ సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయిల్ పామ్‌తో పాటు మునగ, పప్పు ధాన్యాలను అంతర పంటలుగా సాగు చేస్తే అదనపు ఆదాయం లభించడంతో పాటు భూమి సారం పెరుగుతుందని చెప్పారు. ప్రపంచ మార్కెట్లో మునగ ఆకుకు మంచి డిమాండ్ ఉన్నందున రైతులు ఆదాయాన్ని పెంచే పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు రైతుల ఆర్థిక స్థిరత్వానికి బలమైన పునాదిగా నిలుస్తుందని అన్నారు. గిరిజన గ్రామాల్లో ప్రతి కుటుంబానికి సురక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. గిరిజన కుటుంబాల ఆదాయం పెరిగితేనే వారి పిల్లల భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉంటుందని చెప్పారు. గురుకులాలు, ఏకలవ్య పాఠశాలల్లో అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలను గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టడం నేటి అవసరమని , ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి రైతు తన పొలంలో ఫామ్ పాండ్ నిర్మించుకుని వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలని సూచించారు. దీంతో భూగర్భ జలాలు పెరిగి భవిష్యత్తులో వ్యవసాయానికి ఉపయోగపడతాయని తెలిపారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను జిల్లాలోని అన్ని ప్రాంతాలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. యాతాలకుంట టన్నెల్ పనులు పూర్తయిన వెంటనే సీతారామ ప్రాజెక్టు ద్వారా చెరువులను నింపనున్నామని తెలిపారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి రైతులు సహకరిస్తే పనులు వేగంగా పూర్తిచేసి ప్రతి రైతు పొలానికి గోదావరి జలాలు అందిస్తామని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు గోదావరి జలాలు అందించడమే తన జీవిత లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది వర్షపాతం గణనీయంగా తగ్గిందని, సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల, విద్యుత్, పశుసంవర్ధక, మిషన్ భగీరథ తదితర శాఖల సమన్వయంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 90 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, ఈ ఏడాది కొత్తగా 15 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా నిర్దేశించామని తెలిపారు. వరికి బదులుగా మొక్కజొన్న, మిర్చి, ఆయిల్ పామ్, కూరగాయలు, పప్పుధాన్యాలు వంటి తక్కువ నీటి అవసరం ఉన్న పంటల సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఆయిల్ పామ్ నాలుగో సంవత్సరం నుంచి దిగుబడిని ఇవ్వడం ప్రారంభించినప్పటికీ, సుమారు 30 సంవత్సరాల పాటు రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందించే పంటగా నిలుస్తుందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని కలెక్టర్ వివరించారు. అనంతరం ఆత్మనిర్భర్ మిషన్ అపరాల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం కంది, మినుము విత్తనాలను 50 శాతం రాయితీపై అందిస్తున్నదని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి, జిల్లా కలెక్టర్ రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. రైతులు సమీప వ్యవసాయ అధికారులు లేదా వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు, ఆయిల్ పామ్ సంస్థ ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు



మల్లికార్జున ఖార్గే జన్మదిన వేడుకలు..

ఖమ్మం జిల్లా/ వైరా టౌన్ జూలై 21 ( అక్షరం న్యూస్)

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖార్గే జన్మదిన వేడుకలను వైరాలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ పాల్గొని కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి మల్లికార్జున ఖార్గేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మల్లికార్జున ఖార్గే ప్రజాసేవలో విశిష్ట పాత్ర పోషిస్తున్న నాయకుడని కొనియాడారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవిస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో మరింత చురుకుగా సేవలందించాలని ఆకాంక్షించారు. భగవంతుడు ఆయనకు మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్, వైరా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు, ఎగ్జిక్యూటివ్ నెంబర్ వాంకుడోత్ భిక్యా, ఏన్కూర్ మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు స్వర్ణ నరేందర్, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కమతాల రేణుక, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కొప్పుల ప్రభావతి రెడ్డి, జిల్లా సెక్రెటరీ షేక్ మస్తాన్, ఎగ్జిక్యూటివ్ నెంబర్ కొట్టే రాజశేఖర్, సెక్రెటరీ సామెల్, సెక్రటరీ పాటి నరసయ్య తదితరులు పాల్గొన్నారు...

## తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలి

- ఉద్యమకారుల కమిటీ అధ్యక్షులు షేక్ పాషా



ఖమ్మం జిల్లా/ వైరా టౌన్/ జూలై 21 (అక్షరం న్యూస్)

హైదరాబాద్‌లోని తెలంగాణ అమర జ్యోతి ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఉద్యమకారుల కమిటీ ఆ కమిటీ అధ్యక్షులు షేక్ పాషా, జనరల్ సెక్రటరీ కమిటీ దొంత నరసింహారావు ,సభ్యులు మెరుగు కృష్ణయ్య, కన్నెగంటి శ్రీనివాసరావు, సంపసాల వరదరాజ్ కన్నెగంటి హుస్సేన్ పాల్గొని సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్ కే కేశవరావులను కలిసి పలు సమస్యలను గుర్తు చేశారు. గత ప్రభుత్వ

పదేళ్ల పాలనలో బిఆర్ఎస్ తెలంగాణ ఉద్యమకారులను విస్మరించిందని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా ఉద్యమ కారులకు సముచిత స్థానాన్ని కల్పించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అర్హులైన ఉద్యమకారులందరికీ పారదర్శకంగా గుర్తింపు కార్డులను కల్పించి,వారికి ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఇచ్చి గౌరవం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు.

## క్రిస్టియన్ మైనారిటీల స్వయం ఉపాధి పథకాల దరఖాస్తుల గడువు జూలై 31 వరకు పొడిగింపు

- జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ముజాహిద్
- కుట్టు మిషన్, చిన్న వ్యాపారం, ఈ-బైక్, ఈ-స్కూటీ, మోటార్ బైక్ పథకాల కోసం దరఖాస్తుల స్వీకరణ..
- జూలై 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం..

ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ జూలై 21 (అక్షరం న్యూస్)

తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 2026--27 సంవత్సరానికి అర్హులైన క్రిస్టియన్ మైనారిటీల నుంచి స్వయం ఉపాధి పథకాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ గడువును జూలై 31 వరకు పొడిగించినట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ముహమ్మద్ ముజాహిద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన క్రిస్టియన్ మైనారిటీల నుంచి కుట్టు మిషన్, చిన్న వ్యాపారం, ఈ–బైక్, ఈ–స్కూటీ, మోటార్ బైక్ స్వయం ఉపాధి పథకాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నామని తెలిపారు. దరఖాస్తుదారులు క్రిస్టియన్ మైనారిటీకి చెందినవారై ఉండాలని, పట్టణ ప్రాంతాలకు చెందిన అభ్యర్థుల వార్షిక కుటుంబ ఆదాయం రూ. 2 లక్షల లోపు, గ్రామీణ ప్రాంతాలకు చెందిన అభ్యర్థుల వార్షిక కుటుంబ ఆదాయం రూ. 1.50 లక్షల లోపు ఉండాలని పేర్కొన్నారు. కుట్టు మిషన్, చిన్న వ్యాపారం పథకాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయస్సు 21 నుంచి 55 సంవత్సరాల మధ్య, ఈ–బైక్, ఈ–స్కూటీ, మోటార్ బైక్ పథకాలకు 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని తెలిపారు. అర్హులైన క్రిస్టియన్ మైనారిటీలు జూలై 31 వరకు ‾స్త్రశీఎఎం.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9704003002 మొబైల్ నంబర్‌ను సంప్రదించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ముహమ్మద్ ముజాహిద్ ఆ ప్రకటనలో కోరారు.

# మారుమూల ప్రాంతంలోని పాఠశాలల చిన్నారులపై ప్రత్యేక దృష్టి పెట్టండి



. ఐటీడీఏ పీవో బి రాహుల్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / భద్రాచలం / జూలై 21 / అక్షరం న్యూస్ -:ం

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిపిఎస్ పాఠశాలలు,ప్రైమరీ పాఠశాలలు, ఎంపీపీ పాఠశాలలు, గురుకులాలలో చదువుతున్న చిన్నారులకు మెనూ ప్రకారము బలవర్ధకమైన ఆహారము అందిస్తున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఇక్రీశాట్ షార్ట్ నంగియా బృందం డాక్టర్లకు తెలిపారు. మంగళవారం నాడు ఐటిడిఏ కాన్ఫరెన్స్ హాలులో మర్యాదపూర్వకంగా కలిసిన ఇక్రి షాట్ నంగియా కంపెనీ డాక్టర్ల బృందం సభ్యులకు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలల స్థితిగతులు మరియు సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలు నడిపిస్తున్న గిరిజన మహిళలకు ఆర్థికంగా చేయూత అందించడానికి భద్రగిరి మార్ట్ నెలకొల్పి పూర్తిస్థాయి ఆర్గానిక్ వస్తువులనే ప్రజలకు అందిస్తున్నామని, గిరిజన మహిళలు తయారు చేస్తున్న నాణ్యతతో కూడిన మిల్లెట్ బిస్కెట్లు భారత ప్రధాని నరేంద్ర సింగ్ మోడీ మన్ కీ బాత్ లో ప్రశంసించడం వలన ఆ మహిళలు తయారు చేస్తున్న మిల్లెట్ బిస్కెట్లు లండన్ వరకు ఆన్లైన్లో అమ్మకాలు జరుపుతున్నారని అన్నారు. మీ సంస్థ ద్వారా గిరిజన బాలబాలికలకు అందించే న్యూట్రిషన్ ఫుడ్ మారుమూల మండలాలైన దుమ్ముగూడెం, చెర్ల, అశ్వరావుపేట మండలాలలోని గ్రామాలలో ఉన్న జిపిఎస్ పాఠశాలలు, అంగన్వాడీ సెంటర్లు, ప్రైమరీ పాఠశాలల్లో చదువుతున్న చిన్నారులు అందరికీ అందించాలని అన్నారు. అదేవిధంగా పోషకాలు జోడించిన సంపూర్ణ తృణధాన్యాల గురించి గిరిజన గ్రామాలలోని చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. అనంతరం ఇక్రి షాట్ నంగియా కంపెనీ బృందం వారు మాట్లాడుతూ గిరిజన గ్రామాలలోని చిన్నారులకు మరియు గిరిజన సంక్షేమ పాఠశాలలో చదువుతున్న ఏడు నుంచి పది సంవత్సరాల పిల్లలకు పౌష్టికరమైన ఆహారము ఇక్రిశాట్ ఆధ్వర్యంలో పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకొని చిన్నారులకు అందించడానికి రావడం జరిగిందని అన్నారు. అలాగే ఎంపీపీ పాఠశాలల్లో చదివే చిన్నారులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా పోషకాహారం అందించడానికి,భద్రాచలం పట్టణంలోని న్యూట్రిషన్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ను పరిశీలించామని తప్పనిసరిగా రక్తహీనతతో ఉన్న చిన్నారులను గుర్తించి న్యూట్రిషన్ ఫుడ్ అందించేలా ప్రణాళికల రూపొందిస్తున్నామని అన్నారు. ఇంకా గిరిజన గ్రామాలలో ఉన్న పాఠశాలలను సందర్శిస్తామని అన్నారు. అలాగే న్యూట్రిషన్ ప్రాసెసింగ్ యూనిట్ కు చిన్నారులందరికీ బలవర్ధకమైన ఆహారం అందించేలా వారికి సలహాలు సూచనలు ఇచ్చి చేయూత అందిస్తామని పిఓ కి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని శ్రీమతి చందన, ఏడిఎంహెచ్ఓ సైదులు, భద్రాచలం ఇంచార్జి ఎంఈఓ శ్రీమతి రమ, ఇక్రిశాట్ నంగియా బృందం డాక్టర్లు నేడు మాసన్ స్వామి కన్నా, రూపా బెనర్జీ, జూడి థామస్, అభినవ్ ఎం సి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- బ్లాక్‌స్పాట్లలో శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలి..
- జాతీయ రహదారులపై ఆక్రమణలు, అక్రమ ప్రవేశ మార్గాలను పూర్తిగా తొలగించాలి..
- ప్రతి నెల మూడవ శుక్రవారం జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించాలి..
- రోడ్డు భద్రతపై రవాణ శాఖ కమీషనర్ ఇల్లంబర్తి నిర్వహించిన వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్






ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ జూలై 21 (అక్షరం న్యూస్)

ఖమ్మం జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టి జాతీయ రహదారులపై రోడ్డు భద్రతా ప్రమాణాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.మంగళవారం రాష్ట్ర రవాణ శాఖ కమీషనర్ ఇల్లంబర్తి హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమీషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో జాతీయ రహదారులపై రోడ్డు భద్రత చర్యలు, ప్రమాదాల నివారణ, సుప్రీం కోర్టు మార్గదర్శకాల అమలు, అనుసరణ (కంప్లయన్స్) నివేదికల సమర్పణ, ప్రమాదాల తగ్గింపునకు తీసుకోవాల్సిన చర్యలు, జాతీయ రహదారుల వెంట ఉన్న ఆసుపత్రుల మ్యాపింగ్, ఆక్రమణల తొలగింపు, అత్యవసర స్పందన వ్యవస్థ, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఖమ్మం పోలీస్ కమీషనరేట్ కార్యాలయం నుండి సిపి సునీల్ దత్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను ఇప్పటికే గుర్తించినవి, ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. మున్సిపల్ ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు, క్రిటికల్ జంక్షన్లలో అవసరమైన రోడ్డు భద్రతా పనులను తక్షణమే చేపట్టాలని సూచించారు.జిల్లా పరిధిలోని జాతీయ రహదారుల వెంట వాహనాల కోసం అవసరమైన పార్కింగ్ ప్రాంతాలు, ప్రతి 40 నుంచి 50 కిలోమీటర్ల కు ఒకసారి ప్రజలకుఅవసరమైన పార్కింగ్, మరుగుదొడ్లు, ఇతర వే సైడ్ సదుపాయాల వివరాలతో కూడిన అనుసరణ నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుని ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రతి ట్రాఫిక్ ఉల్లంఘనను నమోదు చేసి నిబంధనల ప్రకారం జరిమానాలు విధించే వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. పెట్రోలింగ్ వాహనాలు అందుబాటులో ఉంచి, జాతీయ రహదారులపై అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన అందించాలని, అంబులెన్స్ సేవలు కూడా దానికి అనుసంధానమై ఉంచాలని తెలిపారు. జాతీయ రహదారు లకు సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల మ్యాపింగ్ పూర్తిస్థాయిలో ఉండాలని ఆదేశించారు.జాతీయ రహదారులపై ఉన్న ఆక్రమణలను గుర్తించి వెంటనే తొలగించాలని, జాతీయ రహదారులకు అక్రమంగా ప్రవేశ మార్గాలు కల్పిస్తున్న దాబాలు, వాణిజ్య సంస్థలు, ఇతర నిర్మాణాలను కేంద్ర జాతీయ రహదారుల చట్టం ప్రకారం తొలగించాలని సూచించారు. జాతీయ రహదారుల సేఫ్టీ జోన్ పరిధిలో ఎలాంటి వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జిల్లాలో గుర్తించిన బ్లాక్‌స్పాట్లను శాశ్వతంగా సరిదిద్దేందుకు అందుబాటులో ఉన్న నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలని కలెక్టర్ సూచించారు. బ్లాక్‌స్పాట్ల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని వెంటనే సిద్ధం చేసి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.ఎన్‌హెచ్ఏఐ, రోడ్లు-భవనాల శాఖ అధికారులు ఏటీఎంలు (అడ్వాన్స్ ట్రాఫిక్ మేనేజ్మెంట్ సిస్టమ్), ఆక్రమణలు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ ప్లాన్, లే-బైలు (ఘుఎ-ఎఎవం), వే సైడ్ అమెనిటీస్, బ్లాక్‌స్పాట్లు, తదితర అంశాలపై చేపట్టిన చర్యలకు సంబంధించిన సమగ్ర అనుసరణ నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు.ఇకపై ప్రతి నెల మూడవ శుక్రవారం జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని తప్పని సరిగా నిర్వహించి రోడ్డు భద్రత చర్యల పురోగతిని సమీక్షించాలని, ప్రతి శాఖ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో ఆర్ అండ్ ఎస్ఇ యుగంధర రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రామారావు, నేషనల్ హైవే పిడి దివ్య, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# నాన్న ఇంకా నాతోనే ఉన్నాడు





- తండ్రి జ్ఞాపకాలతో జీవితాన్ని మలుచుకున్న కొప్పూరు యువతి ప్రియదర్శి..

హనుమకొండ జిల్లా/ భీమదేవరపల్లి/జూలై 21/అక్షరం న్యూస్:-

తండ్రి చేయి పట్టుకుని నడిచే అదృష్టం అందరికీ దక్కదు. కానీ తండ్రి భౌతికంగా దూరమైనా ఆయన ఆశయాలు విలువలు ప్రేమను జీవితాంతం హృదయంలో నిలుపుకుని ముందుకు సాగే వారు చాలా అరుదు. అలాంటి అరుదైన కుమార్తెల్లో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూరు గ్రామానికి చెందిన కొమ్ముల ప్రియదర్శి ఒకరు.

చిన్న వయసులోనే తండ్రి కొమ్ముల శ్రీనివాస్‌ను కోల్పోయినా ఆయన నేర్పిన విలువలే తన జీవితానికి మార్గదర్శకంగా మార్చుకుని నేడు హైదరాబాద్‌లో ప్రముఖ సంస్థలో ఫ్యాషన్ డిజైనర్‌గా విజయవంతంగా కొనసాగుతోంది.

### ప్రతి ఉదయం... నాన్నతోనే ప్రారంభం..

ప్రియదర్శి రోజు తండ్రి జ్ఞాపకాలతోనే మొదలవుతుంది. ఉదయం నిద్రలేచిన వెంటనే తండ్రి చిత్రపటం ముందు నిలబడి గుడ్ మార్నింగ్ డాడీ అని పలకరిస్తుంది. ఆ తర్వాత నమస్కరించి ఆయన ఆశీర్వాదం తీసుకున్నాననే భావనతో తన రోజును ప్రారంభిస్తుంది.తండ్రి పుట్టినరోజు వచ్చిన ప్రతిసారి ఆయన ఇప్పటికీ తనతోనే ఉన్నారనే భావనతో కేక్ కట్ చేస్తూ ఆ రోజును ఆనందంగా జరుపుకుంటుంది. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత కూడా ఉద్యోగంలో జరిగిన ప్రతి విషయం తన ఆనందాలు బాధలు విజయాలు కష్టాలు అన్నింటినీ తండ్రితో మాట్లాడుతున్నట్టే ఆయన చిత్రపటం ముందు కూర్చొని చెప్పుకుంటుంది.

### అవార్డు వచ్చినా... ముందుగా డాడీకే..

ఫ్యాషన్ డిజైనింగ్ రంగంలో ప్రతిభ కనబరిచిన ప్రియదర్శి పలు అవార్డులు ప్రశంసలు అందుకుంది. కానీ ప్రతి విజయాన్ని ముందుగా తన తండ్రికే అంకితం చేస్తుంది.

అవార్డు అందుకున్న వెంటనే ఇంటికి వచ్చి తండ్రి చిత్రపటం ముందు నిలబడి డాడీ... నేను సాధించాను... నాకు అవార్డు వచ్చింది అంటూ తన ఆనందాన్ని పంచుకుంటుంది. తండ్రి తన విజయాన్ని చూస్తున్నారనే నమ్మకమే ఆమెకు మరింత ప్రేరణగా నిలుస్తోంది.

### కష్టాల్లో ధైర్యం... జ్ఞాపకాలే బలం

జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా ఒంటరితనం వెంటాడినా తండ్రి చిత్రపటం ముందు కూర్చుంటే తనకు అపారమైన ధైర్యం వస్తుందని ప్రియదర్శి చెబుతోంది.

నాన్న నా పక్కనే ఉండి నాకు ధైర్యం చెబుతున్నట్టే అనిపిస్తుంది. నేను ఎప్పుడూ ఒంటరిగా ఉన్నాననే భావన రాదు. ఆయన ఆశీర్వాదం ఎప్పుడూ నాతోనే ఉంటుంది అని ఆమె భావోద్వేగంగా చెబుతోంది.

### సేవాభావమే తండ్రికి నిజమైన నివాళి..

తండ్రి నేర్పిన విలువలను ఆచరణలో పెట్టేందుకు ప్రియదర్శి ఎప్పుడూ ప్రయత్నిస్తుంటుంది. అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం ప్రతి ఒక్కరిని గౌరవించడం ప్రేమతో మెలగడం తన తండ్రి నుంచి నేర్చుకున్న గొప్ప పాఠాలని చెబుతోంది.

తన వ్యక్తిత్వానికి విజయాలకు కారణం తండ్రి ఇచ్చిన సంస్కారమేనని ఆమె గర్వంగా పేర్కొంటోంది.

### నేటి యువతకు ఆదర్శం..

బంధాలు అనుబంధాలకు విలువ తగ్గిపోతోందనే భావన ఉన్న ఈ రోజుల్లో తండ్రి జ్ఞాపకాలనే తన జీవితానికి బలంగా మార్చుకుని ముందుకు సాగుతున్న ప్రియదర్శి ఎంతోమంది యువతకు ఆదర్శంగా నిలుస్తోంది.

తండ్రి భౌతికంగా దూరమైనా వారు నేర్పిన ప్రేమ విలువలు ఆశయాలు ఎప్పటికీ మనతోనే ఉంటాయని ఆమె జీవితం స్పష్టంగా తెలియజేస్తోంది.

### ప్రియదర్శి మాటల్లో...

మా నాన్న ఈ లోకంలో లేకపోయినా నా మనసులో ఎప్పుడూ ఉన్నారు. నేను చేసే ప్రతి పని ఆయన చూస్తున్నారనే నమ్మకం నాకు ఉంది. నేను నవ్వినా ఏడ్చినా గెలిచినా ఓడినా ముందుగా నాన్నతోనే మాట్లాడుతాను. నాకు ఆయన జ్ఞాపకాలే ధైర్యం... ఆయనే నా ఆత్మవిశ్వాసం.తండ్రి ప్రేమకు కాలంతో సంబంధం లేదని జ్ఞాపకాలు మనిషికి జీవితాంతం అండగా నిలుస్తాయని కొమ్ముల ప్రియదర్శి జీవితం మరోసారి చాటిచెబుతోంది. తండ్రిని కోల్పోయిన బాధను బలంగా మార్చుకుని ఆయన ఆశయాలను తన జీవితంగా మలుచుకున్న ఈ యువతి కథ ప్రతి ఒక్కరి హృదయాన్ని తాకే స్ఫూర్తిదాయకమైన జీవన గాథ.



# రామకృష్ణాపురం రైల్వే గేట్‌కు మోక్షం ఆర్వోబి నిర్మాణంపై ముందడుగు

- ఎంపీ వద్దిరాజు చొరవకు దక్కిన ఫలితం

ఖమ్మం జిల్లా) చింతకాని జూలై 21( అక్షరం న్యూస్)

చింతకాని మండలం రామకృష్ణాపురం సమీపంలోని 107 రైల్వే గేట్ వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణానికి ఎట్టకేలకు అడుగు ముందుకు పడింది. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర చొరవ ఫలితంగా ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న సమస్యకు పరిష్కారం లభించింది. దానికి తోడు గ్రామస్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు చేసిన విజ్ఞప్తులు, వివిధ పత్రికలు, సోషల్ మీడియాలో వచ్చిన కథనాలకు స్పందన లభించింది. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ బాబ్జి ప్రసాద్ ఆధ్వర్యంలో రైల్వే రోడ్ సేఫ్టీ అధికారి సుందర్ సేన్, ఇతర అధికారులతో కలిసి రామకృష్ణాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆర్వోబి నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ అంశం.. గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆమోదం తదితర అంశాలపై సమీక్ష జరిపారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ గాదె నాగలక్ష్మి, ఉపసర్పంచ్ గాదె రామారావు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.ఈ



సందర్భంగా రైల్వే రోడ్ సేఫ్టీ అధికారి సుందర్ సేన్ మాట్లాడుతూ.. ఆర్ఓబీ నిర్మాణానికి అవసరమైన ప్రక్రియలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. నిర్మాణం కోసం భూములు కోల్పోయే రైతులు పూర్తి సహకారం అందించాలని కోరారు. భూమి కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం తగిన పరిహారం అందజేస్తామని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఈ ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. త్వరలోనే సర్వే పనులు ప్రారంభించి నిర్మాణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. గ్రామంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సహకరిస్తే ఆర్ఓబీ నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

### ఎంపీ వద్దిరాజు కృషి..

రామకృష్ణాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం గ్రామస్తులంతా ఏడాది క్రితం ఎంపీ వద్దిరాజు రవిచంద్రను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు రవిచంద్ర స్పందించి ఢిల్లీలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆ సందర్భంగా రామకృష్ణాపురం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ ఆవశ్యకత గురించి మంత్రికి వివరించారు. ఆ మేరకు కొద్ది రోజులకే రైల్వే మంత్రి స్పందించి ఎంపీ రవిచంద్ర కు లేఖ రాశారు. బ్రిడ్జి నిర్మాణ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, దీనిపై తొందరలో సముచిత నిర్ణయం తీసుకుంటామని హామీ ఇస్తూ మంత్రి అశ్విని వైష్ణవ్ హామీ ఇచ్చారు. ఆ మేరకు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని రైల్వే మంత్రిత్వ కార్యాలయం నుంచి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రామకృష్ణాపురం గ్రామస్తులు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కు కృతజ్ఞతలు తెలిపారు.

# టెక్స్‌టైల్ రంగ అభివృద్ధికి
# కేంద్రం తీసుకుంటున్న చర్యలేంటి


- తెలంగాణలో చేనేత రంగానికి అందుతున్న ప్రోత్సాహకాలేమిటి..?
- లోక్‌సభలో ప్రశ్నించిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి
- సమాధానమిచ్చిన కేంద్ర జౌళి శాఖ సహాయ మంత్రి

ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్ జూలై 21 (అక్షరం న్యూస్)

న్యూ ఢిల్లీ: టెక్స్ టైల్స్ రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో తెలపాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి లోక్ సభలో ప్రశ్నించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా మంగళవారం టెక్స్‌టైల్ రంగానికి సంబంధించి కీలక ప్రశ్నలు సంధించారు. తెలంగాణలో ఆమోదించిన చేనేత-పవర్‌లూమ్ రంగాలకు అందుతున్న కేంద్ర సహాయం, ఎగుమతుల ప్రోత్సాహం మరియు కార్మికుల సామాజిక భద్రతపై ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. కేంద్ర జౌళి శాఖ సహాయ మంత్రి పబిత్ర మార్గెరిటా లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు.

### తెలంగాణలో రెండు ఎస్ఐటీపీ పార్కుల ఏర్పాటు..

యాదాద్రి భువనగిరి జిల్లాలోని పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్క్ ద్వారా 189 యూనిట్లు, రంగారెడ్డి జిల్లాలోని వైట్ గోల్డ్ టెక్స్‌టైల్ పార్క్ ద్వారా 10 యూనిట్లు పూర్తయి వాణిజ్య కార్యకలాపాలు సాగిస్తున్నాయని వివరించారు. వరంగల్‌లో 'పీఎం మిత్రా' మెగా టెక్స్‌టైల్ పార్కు ద్వారా రూ. 3,862 కోట్ల పెట్టుబడులతో 24,500 మందికి ఉపాధి లభించిందని పేర్కొన్నారు.



### చేనేత క్లస్టర్ల అభివృద్ధి ఇలా..

తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు 2021-26 మధ్య కాలంలో చిన్న క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమాల(ఎస్‌హెచ్‌డీపీ) కింద 26 క్లస్టర్లు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. దీనికోసం కేంద్రం రూ. 1,223.97 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించగా, ప్రత్యక్షంగా 4,971 మంది చేనేత కార్మికులు లబ్ధి పొందారని స్పష్టం చేశారు.

మోడిఫైడ్ గ్రూప్ వర్క్‌షెడ్ పథకం (+మోవా) కింద 1 ప్రాజెక్టు మంజూరు కాగా రూ. 13.04 లక్షల గ్రాంటులో రూ. 7.82 లక్షలు విడుదలయ్యాయన్నారు. మార్జిన్ మనీ సబ్సిడీ (వీమీ) కింద 149 ప్రాజెక్టులు పూర్తయి రూ. 159.01 లక్షల సబ్సిడీ, ఇాఖకీమ కింద 16 ప్రాజెక్టులకు రూ. 55.91 కోట్ల సబ్సిడీ విడుదలైనట్లు తెలిపారు. 11,719 మగ్గాలు/కిట్లకు రూ. 1,252.36 లక్షల సబ్సిడీ అందజేసినట్లు తెలిపారు.

### కార్మికుల సంక్షేమం, నిధులు.

మూతపడిన 4 మిల్లులకు సంబంధించి టెక్స్‌టైల్స్ వర్కర్స్ రిహాబిలిటేషన్ ఫండ్ (జెజాఖీ) కింద 643 కార్మికులకు రూ.3.19 కోట్లు పంపిణీ చేశామని, హైదరాబాద్ సర్వీస్ సెంటర్ ద్వారా 1,586 ట్రైనీలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చామని, కామన్ ఫెసిలిటీస్ సెంటర్ (జఖీజ) కోసం రూ.2కోట్లు, నూలు బ్యాంకు కార్పస్ ఫండ్ కొరకు రూ. 1.98 కోట్లు విడుదల చేశారమని తెలిపారు.

### బీమా, ఉపకార వేతనాలతో ప్రోత్సాహకం..

గ్రూప్ ఇన్సూరెన్స్ పథకం (+ఞా) కింద 54,387 మంది నమోదు కాగా, సహజ మరణాలకు సంబంధించి 262 క్లెయిమ్స్ కింద రూ. 2,19,50,000, ఎస్ఎస్‌పై కింద 4,902 మంది విద్యార్థులకు రూ. 58,72,800 ఉపకార వేతనాలు పంపిణీ అయ్యాయని తెలిపారు. తెలంగాణ ఎగుమతిదారులతో సహా అందరికీ =ీూఋ, =ీఙఋా, ఋాఙ+ వంటి ఎగుమతి ప్రోత్సాహక పథకాలు అమల్లో ఉన్నాయనిమంత్రి తెలిపారు. 2026-27 లో సంప్రదాయ క్లస్టర్ల ఆధునీకరణకు కృషి చేస్తున్నట్లు కేంద్ర మంత్రి వివరించారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమంలో
# డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలి








- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- రానున్న ఐదు రోజుల్లో జిల్లాలో 90 శాతం డిజిటలైజేషన్ లక్ష్యాన్ని చేరుకోవాలి..
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి నిర్వహించిన వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర

టిఎస్..ఖమ్మం జిల్లా / ఖమ్మం టౌన్ జూలై 21 (అక్షరం న్యూస్)

ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని వేగవంతం చేసి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, ఎన్యూమరేషన్ ప్రక్రియ, ఫిర్యాదుల పరిష్కారం, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరిస్తూ, ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం 80 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని, ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 65 శాతం డిజిటలైజేషన్ జరిగిందని తెలిపారు. జిల్లాలో శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన, మరణించిన ఓటర్ల సంఖ్య సుమారు 55 వేలు (5 శాతం) ఉండగా, వాటిని కూడా పరిగణనలోకి తీసుకుంటే జిల్లాలో సుమారు 85 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయినట్లేనని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. సోమవారం ఒక్కరోజే జిల్లాలో 20 వేల మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేశామని, ఇదే వేగంతో పనులు కొనసాగిస్తే రానున్న ఐదు రోజుల్లో 90 శాతం డిజిటలైజేషన్ లక్ష్యాన్ని చేరుకుంటామని కలెక్టర్ తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించిన మేరకు ప్రతి బూత్ స్థాయి అధికారి (బీఎల్‌వో) లక్ష్యం మేరకు ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేసేలా కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతిరోజూ డిజిటలైజేషన్ పురోగతిని సమీక్షిస్తూ లక్ష్యాలను సాధించాలని సూచించారు.పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, 50 శాతం కంటే తక్కువ పురోగతి ఉన్న పోలింగ్ స్టేషన్లను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో నిరంతర పర్యవేక్షణ నిర్వహించి బీఎల్‌వోలకు అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. ప్రతి ఓటరుకు అందించిన ఎన్యూమరేషన్ ఫారం నింపడంలో బీఎల్‌వోలు ప్రజలకు సహకరించాలని, ఎన్నికల సంఘం రూపొందించిన అవగాహన వీడియోలను విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, ఎస్‌డీసీ సదానందం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డీటీ అన్సారీ, ఇతర ఎన్నికల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## డయాబెటిస్‌తో మతిమరుపు...

డయాబెటిస్ అనేది పెనుభూతంగా మారిన సంగతి తెలిసిందే. భారతదేశంలోనూ షుగర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. కడుపు నిండా ఏది తిందామన్నా రక్తంలో షుగర్ లెవెల్స్ ఎక్కడ పెరిగిపోతాయోనని భయం వారిని వెంటాడుతూనే ఉంది. అందుకే భోజనం విషయంలో అనేక జాగ్రత్తలు తీసుకుంటుంటారు. లెక్కలేసుకుని మరీ ఎంత తినాలో అంతే తింటుంటారు. అలాగే షుగర్‌తో వచ్చే ఇతర ఆరోగ్య ప్రమాదాల గురించీ ఎంతో అప్రమత్తంగా ఉంటుంటారు. అలాంటి డయాబెటిస్ రోగులకు మరో షాకింగ్ న్యూస్. వారికి మతిమరుపు వచ్చే ప్రమాదం పొంచి ఉందని తాజా అధ్యయనం చెబుతోంది. బోస్టన్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రముఖ డాక్టర్ జెన్నిఫర్ వీవ్ నేతృత్వంలో చేసిన తాజా అధ్యయనంలో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి.




డయాబెటిస్ రోగులకు డిమెన్షియా(మతిమరుపు) వచ్చే ప్రమాదం ఉందని ఆ అధ్యయనంలో తేలింది. సాధారణ వ్యక్తుల కంటే వీరికి ఈ వ్యాధి వచ్చే ప్రమాదం మూడు రెట్లు అధికంగా పొంచి ఉందని జెన్నిఫర్ తెలిపారు. సుమారు 2.83లక్షల మందిపై సుదీర్ఘ అధ్యయనం చేసి ఈ విషయాన్ని కనుగొన్నట్లు చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలను అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీకి చెందిన న్యూరాలజీ పత్రికలో ప్రచురితమయ్యాయి. టైప్-1 డయాబెటిస్ ఉన్నవారికి భవిష్యత్తులో మతిమరుపు వ్యాధి వచ్చే అవకాశం 3 రెట్లు అధికంగా ఉందని.. టైప్-2 డయాబెటిస్ వచ్చే వారికి ఈ ముప్పు 2 రెట్లు అధికంగా ఉందని అధ్యయనం చెబుతోంది. సాధారణ వ్యక్తులకు అంటే డయాబెటిస్ లేని వారిలో కేవలం 0.6 శాతం మందికి మాత్రమే డిమెన్షియా రాగా.. టైప్-1 బాధితుల్లో 2.6శాతం మందికి వచ్చినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

## ఈ ఆకులతో మధుమేహం, ఊబకాయం రెండింటికీ చెక్.. ఎలాగో తెలుసా..!

ప్రస్తుత జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా అనేక అనారోగ్యాలు



వ్యాపిస్తున్నాయి. మధుమేహం, ఊబకాయం లాంటి సమస్యలతో అనేక మంది బాధపడుతున్నారు. ఆ అనారోగ్య సమస్యల నుంచి బయటపడేందుకు చాలామంది అనేక ప్రయత్నాలు చేసి కూడా విఫలమవుతున్నారు. అయితే ఈ మధుమేహం, ఊబకాయం సమస్యలకు చెక్ పెట్టేందుకు జామ ఆకులు అద్భుత ఔషధంగా పనిచేస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ ఆకులను క్రమం తప్పకుండా తీసుకోవడంవల్ల ఈ రెండు సమస్యలకే కాకుండా అనేక ఇతర అనారోగ్య సమస్యలకు కూడా పరిష్కారం ఉంటుందని అంటున్నారు. జామకు ప్రయోజనాలను ఇప్పుడు తెలుసుకుందాం..

### ప్రయోజనాలు..

జామ ఆకుల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. జామ ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ మైక్రోబియల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి కడుపు పూతల నుంచి శరీరాన్ని రక్షించడంలో సహాయపడుతాయి. దగ్గు, దురద మొదలైన వాటితో బాధపడుతున్నవారు జామ ఆకులను తినాలి. ఎందుకంటే వీటిలో శరీరానికి ఉపశమనాన్ని అందించే యాంటీ అలర్జీ లక్షణాలు ఉంటాయి. అంతేకాదు జామ ఆకులను వివిధ రూపాల్లో తీసుకుంటే ఆరోగ్యం మెరుగుపడుతుంది. జామ ఆకులను క్రమం తప్పకుండా తీసుకుంటూ ఉంటే మగవారికి మేలు చేస్తుంది. సంతానలేమి సమస్యను దూరం చేస్తుంది. జామ ఆకుల సారాన్ని తీసుకుంటే స్పెర్మ్ నాణ్యత, కౌంట్ పెరుగుతుంది. జామ ఆకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ నుంచి ఉపశమనం అందిస్తాయి. జామ ఆకులను రెగ్యులర్‌గా తింటే ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. జామపండుతో ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయో జామ ఆకులతో కూడా అంతకుమించి ప్రయోజనాలు పొందవచ్చునని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. జామాకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ మైక్రోబియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. జామ ఆకులు క్యాలరీ ఫ్రీ. ఇవి బరువు తగ్గడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయి. జామ ఆకులను పచ్చిగా తిన్నా కూడా రుచిగా ఉంటాయి. కావాలనుకుంటే జ్యూస్‌లా చేసుకుని తాగవచ్చు. జామ ఆకులను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చర్మం ముడతలు మాయమవుతాయి. మొటిమలు, నల్ల మచ్చలను తొలగించడంతో జామ ఆకులు సహాయపడతాయి. జామ ఆకులు హైపర్ పిగ్మెంటేషన్‌ను తగ్గిస్తాయి. జామ ఆకుల పేస్ట్‌ను అప్లై చేసుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చు. జుట్టును ఒత్తుగా మార్చడంలో జామ ఆకుల సారం సహాయపడుతుంది. ఈ రసం తీసుకుంటే జుట్టు మూలాల నుంచి దృఢంగా మారుతుంది. జామ ఆకుల పేస్ట్‌ను తలకు రాసుకుంటే జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. జామ ఆకుల్లో కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి శరీరానికి సహాయపడే అనేక అంశాలు ఉన్నాయి. జామ ఆకుల టీ తాగితే రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గి, మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. అంతే కాదు శరీరంలో రక్త ప్రసరణను మెరుగుపరిచి గుండె జబ్బుల సమస్యలను దూరం చేస్తుంది. పిండి పదార్థాలు చక్కెరలుగా మారడాన్ని జామ ఆకుల సారం నియంత్రిస్తుంది. దాంతో మధుమేహం అదుపులో ఉంటుంది. ఊబకాయంతో బాధపడేవారు జామ ఆకుల టీ తీసుకోవాలి. జామ ఆకులతో తయారు చేసిన టీ తాగడంతో జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా మారుతుంది. జామ ఆకుల టీతో జీర్ణ వ్యవస్థలో ఉన్న చెడు బ్యాక్టీరియా తొలగుతుంది. ఇందులోని డైటరీ ఫైబర్ జీర్ణ సమస్యలను దూరం చేస్తుంది. జామ ఆకులను తీసుకోవడంతో డెంగ్యూ నుంచి వేగంగా కోలుకోవచ్చు. జామ ఆకులను తీసుకుంటే రక్తంలో ప్లేట్‌లెట్స్ సంఖ్య వేగంగా పెరుగుతుంది. జ్వరం తీవ్రత సైతం తగ్గుతుంది.

## ఈ సీజన్‌లో చాలా మందికి వచ్చే గొంతు పొడిబారే సమస్య.. ఎందుకు వస్తుంది..

శీతాకాలం ముగిసి ఉష్ణోగ్రతలు పెరగడం ప్రారంభమైనప్పుడు, చాలా మందిలో ఒక సాధారణ సమస్య కనిపిస్తుంది. చాలా మందికి ఉదయం లేవగానే గొంతు ఎండి పోయినట్టు, గరుకుగా లేదా గొంతు బిగుసుకు న్నట్టు అనిపిస్తుంది. వసంత కాలం పూలతో అందంగా ఉన్నప్పటికీ, అదే సమయంలో గాలిలో పుప్పొడి స్థాయిలు పెరుగుతాయి, వాతావరణ మార్పులు వేగంగా జరుగుతాయి. ఈ మార్పులు శ్వాసకోశ మార్గానికి చికాకును కలిగించి గొంతు అసౌకర్యానికి కారణమవుతాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (జిఒ) ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అలర్జీ సంబంధిత శ్వాస సమస్యలతో బాధపడుతున్నారు. భారతదేశంలో వసంత కాలంలో చెట్లు, గడ్డి నుంచి వచ్చే పొలెన్, ధూళి, కాలుష్యం, తేమ మార్పులన్నీ కూడా గొంతు, శ్వాసనాళాలపై ప్రభావం చూపుతాయి.

### కారణాలు ఇవే..

అలాగే వసంతకాలంలో గొంతు ఎండిపోయినట్టు, పొడిగా అనిపించడానికి అనేక కారణాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. వసంత కాలంలో మొక్కలు పెద్ద మొత్తంలో పుప్పొడిని విడుదల చేస్తాయి. ఈ చిన్న కణాలు శ్వాసలోకి వెళ్లినప్పుడు శరీరం హిస్టమిన్స్ ను విడుదల చేస్తుంది. దీంతో ముక్కు, గొంతులో వాపు వస్తుంది. దీని వల్ల గొంతు ఎండిపోవడం, దురద, దగ్గు, గొంతు గరుకుగా మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. గొంతులో చికాకుకు మరో సాధారణ కారణం పోస్ట్-నాసల్ డ్రిప్. ఈ పరిస్థితిలో మ్యూకస్ గొంతు వెనుక భాగంలో చేరుతుంది. ఇది నిరంతరం గొంతులోకి జారుతుంది. దీంతో నిరంతరం చికాకు, దగ్గు, గొంతు సవరించడం, గొంతు గరగర వంటి లక్షణాలు ప్రేరేపించబడతాయి. అలాగే వసంత కాలంలో ఉష్ణోగ్రతలు మారుతుంటాయి. పొడి గాలులు, ధూళి పెరుగుతాయి. కాలుష్యం ఎక్కువ అవుతుంది. ఇవి గొంతు ఎండిపోవడానికి కారణమవుతాయి. వీటితో పాటు ఇండోర్ వాతావరణాలు కూడా ఈ సమస్యకు దోహదం చేస్తాయి. ఇాజ గదుల్లో తేమ తగ్గిపోవడం వల్ల గొంతు, ముక్కు ఎండిపోతాయి. ఇంట్లోని పొడి గాలి శ్వాసకోశ మార్గానికి చికాకును కలిగించి అలెర్జీలు ఉన్న వారిలో లక్షణాలు మరింత తీవ్రతరం అవుతాయి.

## పశ్చిమాసియాలో పరిస్థితి మళ్లీ ఉద్రిక్తం

- పూర్తిస్థాయి యుద్ధం చేస్తున్నామన్న ఇరాన్

టెహ్రాన్,జూలై21 అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణల నేపథ్యంలో పశ్చిమాసియాలో పరిస్థితి మళ్లీ వేడెక్కింది. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ దేశం ప్రస్తుతం అమెరికాతో పూర్తి స్థాయి యుద్ధం చేస్తోందని ప్రకటించారు. ప్రస్తుతం కేవలం సైనిక పరంగానే కాకుండా ఆర్థిక రంగంలో కూడా తీవ్ర పోరాటం కొనసాగుతోందని, ప్రజల జీవనోపాధిని కాపాడటం ప్రభుత్వానికి అత్యంత కీలక బాధ్యతగా మారిందని ఆయన పేర్కొన్నారు. దేశం యుద్ధ పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పటికీ, ప్రజల దైనందిన జీవితం దెబ్బతినకుండా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పెజెష్కియన్ అన్నారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం, ప్రజల జీవన ప్రమాణాలను కాపాడడం ప్రస్తుతం అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఇరాన్ వ్యాప్తంగా అమెరికా దాడులు చేస్తోందని, ఆ పరిణామాలను దేశ ప్రజలు అంగీకరించాలని కోరారు. టీవల కొద్ది రోజులుగా అమెరికా-ఇరాన్ మధ్య వైమానిక దాడులు కొనసాగుతున్నాయి. హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరగడంతో ప్రపంచ చమురు సరఫరాపై కూడా ప్రభావం పడుతోంది. అయితే యుద్ధ వాతావరణం నెలకొన్నప్పటికీ, ఉద్రిక్తతలను తగ్గించేందుకు పలు దేశాలు దౌత్యపరమైన ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. కానీ, ఇరు దేశాలు తమ తమ వైఖరిని మార్చుకోకపోవడంతో పరిస్థితి ఇంకా అనిశ్చితంగానే ఉంది.


## పశ్చిమాసియా యుద్ధంతో అమెరికా అడ్వైజరీ జారీ

- ప్రపంచంలోని అమెరికా పౌరులకు హెచ్చరికలు
- అప్రమత్తంగా ఉండాలని సూచనలు

వాషింగ్టన్,జూలై21: పశ్చిమాసియాలో రోజురోజుకూ ఉద్రిక్త పరిస్థితులు తీవ్రమవుతున్న నేపథ్యంలో అమెరికా విదేశాంగ శాఖ కీలక ప్రకటన చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ పౌరులకు 'వరల్డ్‌వైడ్ కాషన్' పేరుతో భద్రతా హెచ్చరిక జారీ చేసింది. అమెరికన్లు విదేశాల్లో ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, స్థానిక పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించింది. పశ్చిమాసియలో పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా అమెరికా ప్రయోజనాలు, పౌరులను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ హెచ్చరిక జారీ చేసినట్లు స్టేట్ డిపార్ట్‌మెంట్ తెలిపింది. ముఖ్యంగా అమెరికా రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలను కచ్చితంగా పాటించాలని పౌరులకు సూచించింది. వసరం లేని ప్రయాణాలను నివారించాలని, జనసమ్మర్థ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, స్థానిక వార్తలు, భద్రతా హెచ్చరికలను నిరంతరం గమనించాలని, సమీపంలోని అమెరికా రాయబార కార్యాలయం లేదా కాన్సులేట్ సూచనలను అనుసరించాలని, అత్యవసర పరిస్థితుల్లో కుటుంబ సభ్యులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని సూచించింది. గత కొద్ది రోజులుగా ఇరాన్‌పై అమెరికా వరుస దాడులు చేస్తోంది (ఎసజీని జా ఇనీన్గా÷తిఇబి). ఇరాన్‌లోని పలు కేంద్రాలపై వైమానిక దాడులు చేస్తోంది. అందుకు ప్రతిగా గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ విరుచుకుపడుతోంది. ఈ నేపథ్యంలో పలు దేశాల్లో ఉన్న అమెరికా పౌరులు అప్రమత్తంగా ఉండాలని స్టేట్ డిపార్ట్‌మెంట్ హెచ్చరిక జారీ చేసింది.

## పాక్‌తో సింధూనదీ జలాల ఒప్పందం

- ఇప్పుడున్నట్లుగా కుదరదు
- కృతనిశ్చయంతో ఉన్న కేంద్ర ప్రభుత్వం



న్యూఢిల్లీ,జూలై21: సింధూ జలాల ఒప్పందం ప్రస్తుత రూపంలోనే మళ్లీ అమల్లోకి వచ్చే అవకాశమే లేదని తెలుస్తోంది. ఈ ఒప్పందాన్ని పునరుద్ధరించాల్సి వస్తే.. మార్పులు తప్పనిసరి అని భారత ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రదర్శిస్తోంది. అది కూడా పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని విడనాడితేనే సాధ్యమవు తుందని చెబుతోంది. ఈ మేరకు ప్రభుత్వవర్గాలను ఉటంకిస్తూ ఓ జాతీయ మీడియా కథనం పేర్కొంది. గతేడాది పహల్గాం దాడి తర్వాత భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌కు గట్టి బుద్ధి చెప్పింది. ఇరు దేశాల మధ్య ఆరు దశాబ్దాలకుపైగా ఉన్న సింధూజలాల ఒప్పందాన్ని నిలిపివేసింది . అయితే.. ప్రస్తుతానికి ఆ ఒప్పందం నుంచి వైదొలగాలని ప్రభుత్వం ఆలోచించడం లేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ఏ అంతర్జాతీయ ఒప్పందమైనా దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్నట్లు తేలితే.. ఒక సార్వభౌమ దేశంగా దానిని రద్దు చేసే హక్కు భారత్‌కు ఉందని పేర్కొన్నాయి. సింధూ జలాల విషయంలో భారత నిర్ణయం పాకిస్థాన్ (ఖజీతిబబిజీని) చర్యలపైనే ఆధారపడి ఉంటుందన్నాయి. ఆ ఒప్పందం నిలిపివేసినప్పటి నుంచి ఉక్కిరిబిక్కిరి అవుతోన్న పాక్.. సింధూ జలాల్లో తమ వాటా తీసుకుంటే తీవ్రపరిణామాలు తప్పవని ప్రేలాపనలు చేస్తోంది. ఒప్పందం నిలిపివేత వల్ల ఆ దేశంలో నీటికొరత ఏర్పడుతోందని చేస్తోన్న ప్రకటనలను భారత్ ఖండిస్తోంది. నీటిని నిల్వ చేసే సామర్థ్యాలు లేకనే భారతదేశాన్ని నిందిస్తూ.. పాక్ తప్పుడు ప్రచారం చేస్తోందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. భారత్ పదేపదే ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ.. ఉగ్రవాదాన్ని అరికట్టడానికి దాయాది అర్థవంతమైన చర్యలు తీసుకున్న దాఖలాలు ఏవీ లేవన్నాయి. అదీగాక ఐక్యరాజ్యసమితి నిషేధిత జాబితాలో ఉన్న వ్యక్తులు పాక్‌లో బహిరంగ కార్యక్రమాల్లో కనిపిస్తున్నారని ఎండగట్టాయి. పశ్చిమ నదులైన జీలం, చినాబ్‌లపై జమ్మూకశ్మీర్‌లో నిర్మితమవుతున్న జల విద్యుత్ కేంద్రాలపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఆ ప్రాజెక్టులను ఆలస్యం చేసేందుకు ఒప్పందంలోని వివాదాల పరిష్కారాలకు సంబంధించిన నిబంధనలను పాక్ దుర్వినియోగం చేస్తోందని ప్రభుత్వ వర్గాలు ఆరోపించాయి. సింధు, దాని ఉపనదుల జలాలను పంచుకోవడానికి ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్ , పాకిస్థాన్‌ల మధ్య 1960లో ఒప్పందం కుదిరింది.

# ఉరుముతున్న యుద్ధమేఘాలు !



న్యూఢిల్లీ,జూలై21 పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు మళ్లీ కమ్ముకోవడం తో ప్రపంచదేశాలు దిక్కుతోచని స్థితికి చేరాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కూడా మళ్లీ తీవ్రస్థాయికి చేరింది. నియంతల కారణంగా ప్రపంచానికి శాంతి లేకుండా పోతోంది. వాళ్లు,వాళ్లు కొట్టుకు చస్తున్నా ఫర్వాలేదు..ఇందులో మిగతా దేశాలు తల్లడిల్లి పోతున్నాయి. ముఖ్యంగా అమెరికా మళ్లీ ఇరాన్‌పై భీకరదాడులుకు దిగుతోంది. ట్రంప్‌ను అంతమొందిస్తాం అంటూ ఇరాన్‌లో పోస్టర్లు కలకలం రేపుతున్నాయి. అలాగే ప్రపంచంలోని అమెరికన్లు జాగ్రత్తగా ఉండాలంటూ అమెరికా ప్రజలకు హెచ్చరికలు చేసింది. ఈ క్రమంలో యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చనుందన్న సంకేతాలు వస్తున్నాయి. దీంతో చమురు సమస్యలు మళ్లీ మొదటికి అన్నట్లుగా పరస్థితులు కనిపిస్తున్నాయి. ఇరాన్‌ను సర్వనాశనం చేసే వరకు వదలనని ట్రంప్ భీష్మించుకున్నారు. ఇప్పుడు ఇజ్రాయిల్ వెనక్కి తగ్గగా అమెరికానే యుద్ధాన్ని ఎగదోస్తోంది. మరోవైపు అమెరికా భూతల దాడికి దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్ హెచ్చరించింది. అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణల నేపథ్యంలో పశ్చిమాసియాలో పరిస్థితి మళ్లీ వేడెక్కింది. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ దేశం ప్రస్తుతం అమెరికాతో పూర్తి స్థాయి యుద్ధం చేస్తోందని ప్రకటించారు. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేసినా గట్టిగా బదులిస్తామని స్పష్టం చేసింది. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి మాట్లాడుతూ అమెరికాతో కుదిరిన అవగాహన ఒప్పందం స్పష్టంగా ఉంది. అందులో ఎలాంటి సందిగ్ధత లేదు. ఒప్పందం చిన్నదే అయినా మొత్తం 14 క్లాజ్‌లు ఉన్నాయి. హర్మూజ్ జలసంధి భవిష్యత్ నిర్వహణ బాధ్యత ఇరాన్‌కే చెందుతుంది. ఈ అంశాన్ని ఒమన్‌తో పాటు ప్రాంతీయ దేశాలతో చర్చిస్తూ ముందుకు తీసుకెళ్తాం. ఒప్పందంలోని నిబంధనలు స్పష్టంగా ఉన్నందున, వాటిని ఉల్లంఘించడానికి అమెరికాకు ఎలాంటి అవకాశం లేదని తెలిపారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌పై సైనిక చర్యలు విస్తరించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే సైనిక సామర్థ్యం అమెరికాకు ఉన్నప్పటికీ.. దాన్ని ఎక్కువ రోజులు అధీనంలో ఉంచుకోవడం అంత సులభం కాదని భద్రతా నిపుణులు చెబుతున్నారు. ఒక వేళ ఆక్రమణకు దిగితే ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. బుషెహర్ ప్రావిన్స్ తీరానికి 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖర్గ్ ద్వీపం ఇరాన్ చమురు ఎగుమతులకు ప్రధాన కేంద్రం. ఫిబ్రవరి 28న మొదలైన యుద్ధం దాదాపు ఐదు నెలలు కావస్తోంది. అయినా అగ్గి చల్లారడం లేదు. ఒప్పందం చేసుకున్న తరవాత కూడా ట్రంప్ మళ్లీమళ్లీ దాడులకు తెగిస్తున్నారు. తమ షరతులకు ఒప్పుకోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని వదులుకునే వరకు ఆ దేశంతో శాంతి ఒప్పందం కుదరదని ఆయన తెలిపారు. బాంబు దాడి కంటే దిగ్బంధనమే ఎక్కువ ప్రభావవంతంగా ఉంది. వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారి పరిస్థితి మరింత దారుణంగా ఉండ బోతోంది. వారు రాజీ పడాలనుకుంటున్నారు. నేను దిగ్బంధనాన్ని కొనసాగించడం వారికి ఇష్టం లేదు. ఎత్తివేయడం నాకు ఇష్టం లేదు. ఎందుకంటే వారు అణ్వాయుధాన్ని కలిగి ఉండడానికి వీల్లేదు' అని ట్రంప్ గతంలోనే స్పష్టం చేశారు. శాంతి ఒప్పందానికి చిల్లు పెట్టారని, ట్రంప్ చేస్తున్న బెదిరింపులపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది అమెరికా మోసపూరిత ప్రణాళిక ఓడిపోతుందని, దిగ్బంధనం ద్వారా దేశంలో అంతర్గత కలహాలను సృష్టించాలనే ట్రంప్ ప్రణాళిక ఎన్నటికీ సఫలం కాదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు. ఏదేమైనా అమెరికా-ఇరాన్ మధ్య ప్రస్తుతానికి చర్చలు జరగడం లేదు. ఇకపై మంచివాడిగా ఉండను అని గతంలో ట్రంప్ చేసిన హెచ్చరికలు తాజా పరిస్థితికి అద్దం పడుతున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఉన్న సున్ని తమైన కాల్పుల విరమణ ఒప్పందంపై అనిశ్చితి పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచదేశాలు కూడా పెద్దగా స్పందించడం లేదు. ఏ దేశం కూడా ఈ సుదీర్ఘ యుద్ధానికి అడ్డుపడడం లేదు. ఇరాన్ చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని ట్రంప్ భావిస్తున్నారు. అయితే ఇరాన్ ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. తాడోపేడో తేల్చుకునేదాకా వదిలేది లేదని హెచ్చరికలు చేస్తోంది. అలాగే అమెరికా స్థావరాలపై భీకర దాడులు చేస్తోంది. ఈక్రమంలో ఈ యుద్ధం ఇప్పట్లో ముస్తుందని అనుకోవడానికి లేదు. ప్రపంచదేశాలు ఏకమైతే తప్ప యుద్ధ పరిస్థితులను అదుపు చేయడం అసాధ్యంగా కనిపిస్తోంది.

## జమ్మూ కాశ్మీర్‌లో క్లౌడ్ బరస్ట్

**కొండ చరియలు విరిగి పడి పలువురు గల్లంతు**

**వరదలతో ఇప్పటికే పలువురు మృతి**

శ్రీనగర్,జూలై21 జమ్మూకశ్మీర్‌లో మేఘ విస్ఫోటం కారణంగా సంభవించిన ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టించాయి. భారీ వర్షాలతో కొండచరియలు విరిగిపడటం, వరదల కారణంగా సరిహద్దు జిల్లాలైన పూంఛ్, రాజౌరీల్లో ఇప్పటికే 12 మంది మృతి చెందగా.. పలువురు గల్లంతయ్యారు. రోడ్లు, ఇళ్లుసహా పలు ప్రభుత్వ, ప్రైవేటు మౌలిక సదుపాయాలు చాలావరకు దెబ్బతిన్నాయి. దీంతో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సోమవారం దిల్లీలో రాష్ట్ర హోదా కోసం తలపెట్టిన ఆందోళనను విరమించుకుని జమ్మూకు హుటాహుటిన బయల్దేరి వెళ్లారు. పూంఛ్ జిల్లాలోని సురన్‌కోట్ తెహసీల్ ప్రాంతంలో ఎక్కువ విధ్వంసం జరిగింది. ఇక్కడే అధికంగా 10 మరణాలు సంభవించాయి. 9 మృతదేహాలు లభ్యమైనప్పటికీ.. కనీసం 16 మృతి చెంది ఉండే అవకాశం ఉందని పూంఛ్ డిప్యూటీ కమిషనర్ అశోక్ కుమార్ శర్మ తెలిపారు.

జమ్మూ కశ్మీర్‌లోని రియాస్ జిల్లాలో వర్షాలవల్ల మాతా వైష్ణోదేవి యాత్రను తాత్కాలికంగా నిలిపేశారు. సురన్‌కోట్ తెహసీల్ ప్రాంతంలో సంభవించిన మేఘ విస్ఫోటం మహమ్మద్ లతీఫ్ అనే ఒక వ్యక్తి జీవితంలో ఊహించనంత విషాదాన్ని నింపింది. భారీ వర్షం కారణంగా ఆయన తన వాహనాన్ని సురక్షిత ప్రాంతంలో పార్క్ చేయడానికి బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి.. ఆయనకు చెందిన మూడంతస్తుల భవనం మట్టి, బురదలో కూరుకుపోయింది. దీంతో అందులోని 8 మంది కుటుంబసభ్యులు మరణించారు. లతీఫ్‌తో పాటు అతని పెద్ద కుమారుడు మాత్రమే బతికి బట్టకట్టారు. ప్రమాదం సమయంలో లతీఫ్ కుమారుడు జమ్మూలో ఉన్నారు.

## పార్లమెంట్లో ప్రతిపక్ష నేతలకు సమాధానం ఇవ్వరా

**కేంద్ర ప్రభుత్వం తీరుపై మండిపడ్డ ఎంపి చామల**

న్యూఢిల్లీ,జూలై21: పార్లమెంటులో ప్రతిపక్ష నేతలు అడిగిన అంశాలకు కేంద్రం ఎందుకు సమాధానం చెప్పట్లేదని కాంగ్రెస్ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీజేపీ పార్టీ మద్దతుదారు, కార్యకర్తలను కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఎంపీలు పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ చామల మాట్లాడారు. ర్యాలీ సందర్భంగా సీజేపీ కార్యకర్తలపై ఢిల్లీ పోలీసులు లాఠీఛార్జ్ చేశారని అన్నారు. ఈ ఘటనలో పలువురు సీజేపీ కార్యకర్తలకు గాయాలయ్యాయని వెల్లడించారు. ఆర్ఎంఎల్ ఆస్పత్రిలో సీజేపీ కార్యకర్తలను రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో కలిసి పరామర్శించినట్లు ఎంపీ చామల చెప్పుకొచ్చారు. విద్యార్థులపై లాఠీఛార్జ్ చేసిన ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. ధర్మేంద్ర ప్రధాన్‌తో ఎందుకు రాజీనామా చేయించట్లేదని ఎంపీ చామల నిలదీశారు. ప్రధాని మోదీని మూడోసారి ప్రజలు ఎన్నుకున్నారని తెలిపారు. ప్రజా సమస్యలను మోదీ పరిష్కరించే దిశగా ఎందుకు ముందుకు పోవట్లేదని నిలదీశారు. రైతులు హరియాణాలో ఆందోళన చేస్తున్నారని, వారిని ఎందుకు అడ్డుకుంటున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు.

## కిసాన్ ఘాట్ వద్ద నిరసనకు వేలాదిగా రైతుల రాక

**పోలీసుల కట్టుదిట్టమైన భద్రతా చర్యలు**

**హర్యానా-పంజాబ్ శంభు సరిహద్దు వద్ద ఉద్రిక్తత**

న్యూఢిల్లీ,జూలై21 హర్యానా-పంజాబ్ సరిహద్దులోని శంభు బార్డర్ వద్ద హైటెన్షన్ నెలకొంది. మహాపంచాయత్‌లో పాల్గొనేందుకు పంజాబ్, హర్యానా నుంచి ఢిల్లీ వైపుగా వేలాది మంది రైతులు బయలుదేరారు. ఢిల్లీలోని కిసాన్ ఘాట్ వద్ద నిరసన తెలిపేందుకు అన్నదాతలు వస్తుండటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతిపాదిత భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంలో భాగంగా తక్కువ ధరకు, సబ్సిడీతో కూడిన అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు భారత మార్కెట్లను తెరవడాన్ని వ్యతిరేకిస్తూ రైతులు నిరసనకు దిగుతున్నారు. అయితే, వారిని అడ్డుకునేందుకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఢిల్లీలోని కిసాన్ ఘాట్ వద్ద మహాపంచాయత్‌కు 'దేశ్ బచావో మోర్చా' పిలుపునిచ్చింది. దేశవ్యాప్తంగా సుమారు 550 రైతు సంఘాలు, సామాజిక సంస్థలు ఇందులో పాల్గొననున్నాయి. అయితే, నేడు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ ఢిల్లీకి బయలుదేరుతున్నట్లు ప్రకటించింది. దీంతో శంభు సరిహద్దును పోలీసులు మూసివేశారు. రైతులను అడ్డుకునేందుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ అన్నదాతలను నిలువరించేందుకు చర్యలు చేపట్టారు. బారికేడ్లు, ఇనుప కంచెలను ఏర్పాటు చేశారు. సందర్భంగా కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ పంజాబ్ నాయకుడు జర్మన్‌జిత్ సింగ్ బండాలా మాట్లాడారు. ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం భారతీయ రైతులు, కార్మికులు, చిన్న వ్యాపారులు, విస్తృత ప్రజానీకంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు. భారతదేశంలోని చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాలను విస్మరిస్తూ అమెరికన్ కంపెనీలు, రైతులకు ప్రయోజనం చేకూర్చడమే ఈ ఒప్పందం లక్ష్యమని బండాలా ఆరోపించారు. నేడు పంజాబ్ రైతులతో పాటు హర్యానా, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ సహా పలు రాష్ట్రాల నుంచి నిరసనలో పాల్గొనేందుకు అన్నదాతలు వస్తున్నారని తెలిపారు. ఒకవేళ తాము ఢిల్లీకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకుంటే అక్కడే శాంతియుత సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ నిరసన ఆరంభం మాత్రమేనని, ఒప్పందాన్ని కేంద్రం రద్దు చేయకపోయినా, తమ డిమాండ్లను పరిష్కరించకపోయినా ఆందోళనను తీవ్రతరం చేస్తామని బండాలా హెచ్చరించారు.


## వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు

ఉత్సవానికి హాజరైన సిఎం సతీమణి

హైదరాబాద్,జూలై21 బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్.. ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. కళ్యాణోత్సవానికి సిఎం రేవంత్ సతీమణి కూతురుతో కలిసి హాజరయ్యారు. అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. మాజీమంత్రి తలసాని కూడా హాజరయ్యారు. వీరి రాకతో పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. అమ్మవారి కల్యాణం ఘనంగా జరిగిందన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షల మంది భక్తులు తరలివచ్చారన్నారు. ప్రత్యేక సమీక్షలు చేసి, ఇచ్చిన ఆదేశాలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పట్లు చేయడంతో ఘనంగా కల్యాణం జరిగిందని తెలిపారు. వికలాంగులు, జోగినిలకు ప్రత్యేక క్యూ లైన్స్ ఏర్పాటు చేయడంతో తోపులాట, తొక్కిసలాట జరగలేదన్నారు. జోగినిలకు ప్రాముఖ్యం ఇవ్వడంతో పాటు వారు తెచ్చిన పట్టువస్త్రాలను అమ్మవారికి చేరవేశామని.. వారిని గ్యాలరీలో తమతో సమానంగా కూర్చునేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు.

## షూటింగ్‌లో గాయపడ్డ బాలయ్య




నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం గోపిచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమా చేస్తుండగా, ఈ చిత్ర షూటింగ్ తాజాగా కాకినాడ పోర్ట్ ప్రాంగణంలో జరుగుతుంది. అయితే భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ కోసం కాకినాడ పోర్ట్ పరిసరాలలో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తుండగా, ఆయన అనుకో కుండా కాలు జారి కిందపడిపోయారు. దాంతో ఆయన మోకాలిక స్వల్ప గాయం అయింది. వెంటనే చిత్ర బృందం షూటింగ్ ఆపేసి బాలయ్యని సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించిన వైద్య బృందం ఇతర పరీక్షలు కూడా నిర్వహించారు. స్వల్ప గాయమే అయిందని, కంగారు పడాల్సిన పనిలేదని వైద్యులు స్పష్టం చేశారు. అయితే కొన్ని రోజుల పాటు బాలయ్య విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు సమాచారం. ఇక సినిమాల విషయానికి వస్తే.. గోపిచంద్ మలినేనితో పాటు కొరటాల దర్శకత్వంలోను బాలయ్య ఓ చిత్రం చేస్తున్నాడు. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని యువసుధ ఆర్ట్స్, ఎస్ఎల్‌వీ సినిమాస్ సంస్థలు భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నాయి. బాలకృష్ణ ఈ సినిమాలో గత చిత్రాలకు భిన్నమైన లుక్‌లో కనిపించనున్నారని, మాఫియా బ్యాక్‌డ్రాప్‌తో కూడిన మాస్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కుతుందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వచ్చే ఏడాది సమ్మర్‌లో సినిమాను విడుదల చేయాలనే లక్ష్యంతో మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

## పంద్రాగస్ట్ పోటీలో సూర్య, నయనతార



తమిళ సినీ పరిశ్రమలో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోరు జరగనుంది. గతంలో 'గజిని', 'ఆధవన్', 'మాస్సు ఎంగిర మసిలామణి' వంటి చిత్రాల్లో కలిసి నటించిన స్టార్ హీరో సూర్య, లేడీ సూపర్ స్టార్ నయనతార ఇప్పుడు ఒకరికి ఒకరు బాక్సాఫీస్ ప్రత్యర్థులుగా మారబోతున్నారు.సూర్య హీరోగా తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ / సన్స్' మరియు నయనతార ప్రధాన పాత్రలో రూపొందుతున్న 'హాయ్ ' చిత్రాలు రెండూ ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్నాయి. దీంతో స్వాతంత్య దినోత్సవ సెలవులను లక్ష్యంగా చేసుకుని ఈ రెండు సినిమాలు నేరుగా పోటీ పడనున్నాయి. మొదట 'విశ్వనాథ్ / సన్స్' చిత్రాన్ని ఆగస్టు 14న విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. అనంతరం నయనతార నటించిన 'హాయ్' మూవీ మేకర్స్ కూడా అదే తేదీని రిలీజ్ డేట్‌గా ప్రకటించడంతో బాక్సాఫీస్ రేసు మరింత ఆసక్తికరంగా మారింది. 'హాయ్' చిత్రానికి లోకేష్ కనగరాజ్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన విష్ణు ఏడవన్ దర్శకత్వం వహిస్తున్నారు. రొమాంటిక్ కామెడీగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో కవిన్ హీరోగా నటిస్తుండగా, కె. భాగ్యరాజ్, రాధికా శరత్‌కుమార్, ప్రభు, వీటీవీ గణెళిష్, సత్యన్, అమృత శ్రీనివాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని రౌడీ పిక్చర్స్, 7 స్క్రీన్ స్టూడియో, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మరోవైపు 'విశ్వనాథ్ / సన్స్' చిత్రంలో సూర్యకు జోడీగా మమితా బైజు నటిస్తున్నారు. కుటుంబ భావోద్వేగాలతో కూడిన హృద్యమైన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. ఒకవైపు ఫ్యామిలీ డ్రామాతో సూర్య, మరోవైపు రొమాంటిక్ కామెడీతో నయనతార ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో ఈ రెండు సినిమాల మధ్య బాక్సాఫీస్ పోటీ ఎలా ఉండబోతుందనే ఆసక్తి సినీ అభిమానుల్లో నెలకొంది. స్వాతంత్య్ర దినోత్సవ వీకెండ్‌లో తమిళ సినీ పరిశ్రమలో ఈ క్లాష్ హాట్ టాపిక్‌గా మారింది.

## సింహాద్రి సన్నివేశంపై రాజమౌళి ఆసక్తికర వ్యాఖ్య

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అత్యంత గుర్తింపు పొందిన భారతీయ దర్శకుల్లో ఒకరిగా నిలిచారు. 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' వంటి చిత్రాలతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న ఆయన.. ఇప్పుడు మహేష్ బాబు హీరోగా తెరకెక్కిస్తున్న భారీ ప్రాజెక్ట్ వారణాసి తో మరోసారి ప్రపంచ ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు. విదేశాల్లో నిర్వహిస్తున్న ప్రమోషనల్ ఈవెంట్లలో రాజమౌళి చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన ఓ ఇంటరాక్షన్ కార్యక్రమంలో పాల్గొన్న రాజమౌళి.. సినిమా నిర్మాణంలో ఎదురయ్యే సవాళ్ల గురించి మాట్లాడారు. జూనియర్ ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కించిన 'సింహాద్రి' చిత్రంలోని ఓ కీలక సన్నివేశాన్ని రాజమౌళి ప్రస్తావించారు. 'సింహాద్రి' సినిమాలో హీరో ఒక మంచి వ్యక్తిని చంపాల్సిన పరిస్థితి వస్తుందని తెలిపారు.

# హిట్‌మ్యాన్‌ను పొగడ్తలతో ముంచెత్తిన రవిశాస్త్రి



లార్డ్స్ మైదానంలో ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో వన్డే మ్యాచ్ కంటే ముందు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాడు. 2027 వన్డే ప్రపంచకప్ వైపు చూస్తున్న భారత సెలెక్టర్లు, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. రోహిత్ శర్మను ఇకపై జట్టులోకి తీసుకోకపోవచ్చని, లార్డ్స్ మ్యాచ్ అతనికి ఆఖరిది కానుందంటూ వార్తలు వచ్చాయి. అయితే 39 ఏళ్ల రోహిత్ శర్మ ఈ మ్యాచ్‌లో విశ్వరూపం చూపించాడు. వింటేజ్ ఆటతో ఇంగ్లాండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. దీంతో తనపై విమర్శలు గుప్పించిన వారి నోళ్లను హిట్ మ్యాన్ మూయించాడు.మైదానం నలుమూలలా బాదుతూ రోహిత్ శర్మ ఆడిన షాట్లు లార్డ్స్ మైదానాన్ని హోరెత్తించాయి. తొలి రెండు వన్డేల్లో 11, 26 పరుగులు మాత్రమే చేసి విఫలమైన రోహిత్, ఆఖరి వన్డేలో అద్భుతంగా పుంజుకున్నాడు. 110 బంతుల్లో 138 పరుగులు స్కోరు చేశాడు. ఇందులో 5 సిక్సులు, 17 ఫోర్లు ఉన్నాయి. ఈ ఇన్నింగ్స్‌పై భారత మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి స్పందించాడు. రోహిత్ శర్మ తనకు తానుగా కొత్తగా నిరూపించుకోవాల్సింది ఏమీ లేదని, తన అద్భుతమైన సెంచరీతో విమర్శకుల నోళ్లను శాశ్వతంగా మూయించేశాడని రవిశాస్త్రి పేర్కొన్నాడు. ఒక ఆటగాడు జట్టుకు అంత సేవ చేసిన తర్వాత ఇలాంటి రూమర్లు రావడం విసుగు కలిగిస్తుందని రవిశాస్త్రి వ్యాఖ్యానించాడు. రోహిత్ శర్మలో ఇంకా ఆడేందుకు కసి ఉన్నన్ని రోజులు అతడికి అవకాశం ఇవ్వాలని.. సెలెక్టర్లను కోరాడు. తనకు ఇక ఆడే సామర్థ్యం లేదని రోహిత్ భావించిన రోజే అతడే స్వయంగా తప్పుకుంటాడని రవిశాస్త్రి స్పష్టం చేశాడు. మరోవైపు తన రీఎంట్రీ ఇన్నింగ్స్ పై రోహిత్ శర్మ బీసీసీఐ అప్‌లోడ్ చేసిన వీడియోలో స్పందించాడు. బయట వచ్చే విమర్శలు, కామెంట్లు తనకు అనవసరమని, మైదానంలోకి వెళ్లి పరుగులు సాధించడమే తన బాధ్యత అని రోహిత్ చెప్పాడు. విమర్శలు లేకపోతే కిక్కు ఉండదని, బయట వారు చేసే పని వారు చేస్తుంటే, మైదానంలో తాను చేయాల్సిన పని తాను చేస్తానని ధీమా వ్యక్తం చేశాడు.



## హాకీ వరల్డ్‌కప్‌నకు భారత జట్టు ప్రకటన

2026 హాకీ ప్రపంచకప్ టోర్నమెంట్‌కు హాకీ ఇండియా భారత జట్టు ను మంగళవారం ప్రకటించింది. 20 మంది సభ్యులతో కూడిన జట్టుకు హర్మన్‌ప్రీత్ సింగ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్ వచ్చే నెల 15న ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లకు నెదర్లాండ్స్, బెల్జియం సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఈ టోర్నీలో భారత్ పూల్ డీలో ఉంది. ఈ గ్రూప్?లో భారత్‌తోపాటు ఇంగ్లాండ్, పాకిస్థాన్, వేల్స్ జట్లు ఉన్నాయి. పురుషుల టోర్నీలో 16 జట్లు పోటీలో ఉన్నాయి. నాలుగేసి జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. ప్రపంచ కప్ జట్టు ఎంపికపై టీమ్ హెడ్ కోచ్ ఫుల్టన్ మాట్లాడారు. 'ఇది చాలా సమతుల్యమైన జట్టు. ఇందులో అనుభవం ఉన్న ఆటగాళ్లు ఉన్నారు. అలాగే అద్భుతమైన ఫామ్‌లో ఉన్న యువ ఆటగాళ్లూ ఉన్నారు. ఈ ఇద్దరితో టీమ్ బ్యాలెన్స్?గా ఉంది. భారత్ ప్రపంచ కప్ గెలిచి 50 ఏళ్లు పూర్తయింది. అందుకే ఇది మాకు ఒక ప్రత్యేకమైన ఎడిషన్ కానుంది. ఆ చరిత్ర ఈ వరల్డ్?కప్?నకు మాకు ప్రేరణ ఇస్తుంది. ఒత్తిడిలో చురుకైన నిర్ణయాలు తీసుకోవడం, మంచి ఔట్?పుట్ ఇవ్వడంపైనే మేం దృష్టి పెట్టాము. మా ప్లేయర్లకు ఆట పట్ల నిబద్ధత ఉంది. వారు తమమత అత్యుత్తమ ప్రదర్శననిస్తూ, జట్టులో ఒకరినొకరు ప్రోత్సహించుకుంటున్నారు. పోటీ ఎంత కఠినంగా ఉంటుందో మాకు తెలుసు. కానీ మా ఆటపై మాకు నమ్మకం ఉంది. మా స్ట్రాటజీ సింపుల్. ఆటపైనే పూర్తి దృష్టి పెట్టడం, పూర్తి స్థాయిలో నిమగ్నమవుతూ టైటిల్ సాధించడమే మా టార్గెట్' అని కోచ్ అన్నారు. పురుషుల హాకీ వరల్డ్?కప్ 1971లో ప్రారంభం కాగా ఆ ఎడిషన్? (తొలి)లో భారత్ మూడో స్థానంతో సరిపెట్టుకుంది. రెండో ఎడిషన్??లో రన్నరప్?గా నిలిచింది. అయితే మూడో ఎడిషన్? (1975లో) ఫైనల్?లో పాకిస్థాన్?ను ఓడించిన టీమ్ఇండియా టైటిల్? ముద్దాడింది. అర్జిత్ పాల్ సింగ్ కెప్టెన్సీలో టీమ్ఇండియా 2-1 తేడాతో పాక్?ను ఓడించింది. ఇక ఆ తర్వాత భారత్ మళ్లీ ఈ టోర్నీలో టైటిల్ అందుకోలేదు. గత ఎడిషన్ (2023) భారత్ తొమ్మిదో స్థానానికి పరిమితమైంది. ఈసారి బలమైన జట్టుతో భారత్ బరిలోకి దిగుతోంది. 50ఏళ్ల నాటి మ్యాజిక్?ను రిపీట్ చేసి రెండోసారి ఈ టైటిల్?ను సాధించడమే లక్ష్యంగా హర్మన్?ప్రీత్ సేన వరల్డ్?కప్?లో ఆడనుంది.

# రామ్‌చరణ్‌తో సుకుమార్ మూవీ





### హీరోయిన్‌గా రష్మిక అంటూ ప్రచారం

క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కాంబినేషన్‌లో మరో భారీ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే వీరిద్దరి కలయికలో వచ్చిన 'రంగస్థలం' ఇండస్ట్రీ హిట్‌గా నిలవడంతో, ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం సినిమా స్క్రిప్ట్ పూర్తిగా సిద్ధమైనట్లు తెలుస్తుండగా, ఇప్పుడు హీరోయిన్ ఎంపిక టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే సుకుమార్ కెరీర్‌ను పరిశీలిస్తే ఒక ఆసక్తికరమైన విషయం కనిపిస్తుంది. 'ఆర్య' నుంచి 'పుష్ప 2' వరకు ఆయన తెరకెక్కించిన ప్రతి సినిమాలో కొత్త హీరోయిన్‌కే అవకాశం ఇచ్చారు.

ఒకసారి నటించిన కథానాయికను వెంటనే మరో సినిమాలో రిపీట్ చేయలేదు. ఇదే ఆయనకు సెంటిమెంట్‌గా మారింది. అయితే ఈసారి రామ్ చరణ్ సినిమా కోసం ఆ సెంటిమెంట్‌ను పక్కన పెట్టే ఆలోచనలో ఉన్నారని ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం పలువురు నటీమణుల పేర్లు పరిశీలించినప్పటికీ, రష్మిక మందన్న పేరు ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. దర్శకుడు సుకుమార్‌తో 'పుష్ప', 'పుష్ప 2' చిత్రాల్లో రష్మిక సక్సెస్‌ఫుల్‌గా పనిచేయడంతో, మరోసారి ఆమెనే ఎంపిక చేయాలనే అభిప్రాయం టీమ్‌లో వ్యక్తమవుతున్నట్లు సమాచారం. రామ్ చరణ్, రష్మిక మందన్న ఇప్పటివరకు ఏ సినిమాలోనూ కలిసి నటించలేదు. ఈ ఫ్రెష్ పెయిర్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందని చిత్రబృందం భావిస్తోందట. అంతేకాకుండా ప్రస్తుతం రష్మిక పాన్ ఇండియా స్థాయిలో వరుస విజయాలతో దూసుకుపోతుం డటం కూడా నిర్మాతలకు అదనపు బలంగా మారింది. ఆమె క్రేజ్ సినిమాకు అన్ని భాషల్లో మంచి బిజినెస్‌కు దోహదపడుతుందనే అంచనాలు ఉన్నాయి. ఒకవేళ రష్మికనే హీరోయిన్‌గా ఖరారు చేస్తే, సుకుమార్ తన కెరీర్‌లో తొలిసారి ఒకే హీరోయిన్‌ను వరుసగా రెండు చిత్రాల్లో తీసుకున్న దర్శకుడిగా నిలుస్తారు. అయితే ప్రస్తుతం ఇవన్నీ ప్రచారంలో ఉన్న వార్తలే. చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వచ్చిన తర్వాతే హీరోయిన్ ఎంపికపై పూర్తి స్పష్టత రానుంది.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers,
RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609